నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం 31 మే 2023

దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవ తెలంగాణ కొండపాక: దశాబ్ది ఉత్సవాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జెడ్పీచైర్మన్ రోజారాధకృష్ణ శర్మతో కలిసి తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై దుబ్బాక, హుస్నాబాద్, జిల్లాలోని జనగాం, మానకొండూర్ నియోజకవర్గలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలో మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 3న తెలంగాణ రైతు దినోత్సవం, 4న సురక్ష దినోత్సవం, 5న విద్యుత్ విజయోత్సవం, 6న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7న సాగునీటి దినోత్సవం, 8న చెరువుల పండుగ, 9న తెలంగాణ సంక్షేమ సంబరాలు, 10న తెలంగాణా సుపరిపాలన దినోత్సవం, 11న తెలంగాణ సాహిత్య దినోత్సవం- కవి సమ్మేళనం, 12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న తెలంగాణ వైద్య ఆరోగ్య దినోత్సవం, 15న తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం, 16న తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం, 17న తెలంగాణ గిరిజన ఉత్సవం, 18న తెలంగాణ మంచినీళ్ల పండుగ, 19న తెలంగాణ హరితోత్సవం, 20న తెలంగాణ విద్యదినోత్సవం, 21న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం, 22న తెలంగాణ అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించాలన్నారు. సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించే సభలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పిడి చంద్రమోహన్ రెడ్డి, డిఎఓ శివప్రసాద్, డిపిఓ దేవకి దేవి, డిఎం%డ%ఎచ్ఓ డా. కాశీనాథ్, డిఎఫ్ఓ శ్రీనివాస్, జెడ్పీ సిఈఓ రమేష్ మున్సిపల్ చైర్మన్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ పరిధిలోని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, విద్యుత్ శాఖ ఏఈ లు, ఐకెపి ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో బీజేపీ దాడులను ఖండించండి



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

త్రిపురలోని కార్మికులు, రైతులు, ప్రజలపై బీజేపీ దుండగులు సాగిస్తున్న ఆటవిక హింసకాండను ఖండిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. మంగళవారం సిద్దిపేటలో సీఐటీయూ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి సాగిస్తున్న హింసకాండపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు దాడిలో ఐదుగురు మరణించి 630 మంది వరకు గాయపడ్డారని తెలిపారు. 65 ఇండ్లు పాక్షికంగా, 96 దుకాణాలు దగ్ధమయ్యాయని అన్నారు. కూరగాయల తోటలు చేపల చెరువులు కూడా విషపూరితం చేస్తూ ఆటవిక హింసకాండం కొనసాగించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి అధ్యక్షులు తిరుపతిరెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యులు యాదవ రెడ్డి సిఐటియు నాయకులు కనకయ్య పద్మ కృష్ణారెడ్డి రామ్ రెడ్డి సంజు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాలి



నవతెలంగాణ- చేగుంట

కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేగుంట మండలం వడియారంలో మంగళవారం రహదారిపై రైతులతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కర్నాల్ పల్లి ఎల్లమ్మ ను దర్శించుకుని, మక్కా రాజుపేట, ఇబ్రహీంపూర్, రుక్మాపూర్, రెడ్డిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి వరికోతలు ప్రారంభించి రెండు నెలలు గడిచినా పూర్తి స్థాయిలో సేకరించలేకపోవడం సిగ్గుచేటన్నారు. రోజుకు ఒక లారీ కూడా పంపకుండా నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమజసమని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాలలో క్వింటాల్‌కు తొమ్మిది కిలోల తరుగు పేరిట దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమకు టార్పాలిన్ ఖర్చులు రూ.అయిదు వేలు అవుతుందని తెలిపారు. రైతుల కోసం ఎంతవరకైనా పోరాటానికి సిద్ధమని శ్రావణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. కనీసం గోనె సంచులు ఇచ్చే స్థితిలో ప్రభుత్వం లేదని ఆరోపించారు. తహసీల్దార్, ఆర్డీవోలతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి చేగుంట మండల అధ్యక్షులు పెంటారెడ్డి, సీనియర్ నాయకులు రాంరెడ్డి, రావిపల్లి శ్రీధర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి ,మోహినొద్దిన్,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బోయిని శ్రీకాంత్, ఇంద్రసేనారెడ్డి, రైతులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి వార్షిక పరీక్షలు

నవ తెలంగాణ - సిద్దిపేట

డాక్టర్ .ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న 6వ సెమిస్టర్, ఓల్డ్ బ్యాచ్ కు సంబంధించిన తృతీయ సంవత్సర విద్యార్థుల వార్షిక పరీక్షలు 31 నుండి జూన్ 05 వరకు నిర్వహించడం జరుగుతుందని రీజినల్ కోఆర్డినేటర్ భవాని తెలిపారు. ఆమె మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం , నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు జూన్ 07 నుండి 15 వరకు, మొదటి సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ విద్యార్థులకు జూన్ 16 నుండి 22 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు పరీక్ష సమయం అన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ ను తీసుకొని పరీక్షకు హాజరుకావాలని కోరారు.

టీజేఎస్ జహీరాబాద్ అభ్యర్థిగా ఆశప్ప



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్రంలో టీజేఎస్ మొదటి అభ్యర్థిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ప్రకటించారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని టీజేఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈసారి జహీరాబాద్ నియోజకవర్గంలో తమ అభ్యర్థి ఆశప్ప ఖచ్చితంగా పోటీ చేస్తారన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతున్నదని.. ఈ పాలన పూర్తిస్థాయిలో అవినీతిలో కూడుకుపోయిందని విమర్శించారు. నాడు తెలంగాణ ఉద్యమానికి తూట్లు పొడిచిన వారే ఈరోజు రాష్ట్రాన్ని ఏలుతున్నారన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు తాము కలిసి వచ్చే పార్టీలతో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారని ప్రకటించారు. రాష్ట్రంలో నిరుపేదల భూములను లాక్కోవడంలో ప్రభుత్వానికి మంచి నైపుణ్యత ఉందన్నారు. జహీరాబాద్ ప్రాంత అభివృద్ధి కోసమే తాము జహీరాబాద్‌లో తమ పార్టీ అభ్యర్థిని బరిలో దింపేందుకు నిర్ణయించడం జరిగిందన్నారు. గత ఐదేండ్లుగా జహీరాబాద్ నియోజకవర్గంలో ఆశప్ప రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని.. ఎన్నో ఉద్యమాలు నిర్వహించి విజయాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పేదలకు గృహాలక్ష్మి



- 75 గజాల స్థలం • రూ.3 లక్షలు సాయం • జూలై నుంచి పథకం అమలు
- నియోజకవర్గానికి 3 వేల కుటుంబాలకు • మూడు దశల్లో లబ్ధిదారుడికి పేమెంట్స్
- జాగలేనోళ్లకు 75 గజాల స్థలం, ఆర్థిక సాయం • జూన్ చివర్లో జీవో

ఇంటి స్థలమున్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయం.. స్థలంలేని పేదలకు 75 గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం అందించేందుకు గృహలక్ష్మి పథకం సిద్ధమైంది. కొత్త పథకానికి సంబంధించి విధి విధానాలను సిద్ధం చేస్తున్నారు. ఈ పథకం కలెక్టర్ల పర్యవేక్షణలో జూలై మొదటి వారం నుంచి అమలుకానుంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకం స్థానంలో గృహలక్ష్మి పథకం రాబోతోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల తర్వాత ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల మంది లబ్దిదారులకు పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఇప్పటికే డబుల్ బడ్‌రూం ఇళ్లు ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్నవి కూడా పూర్తి చేసి లబ్దిదారులకివ్వనున్నారు. ఈ పథకానికి ఆర్థిక భారంతో పాటు స్థల సేకరణ సమస్యగా మారింది. దీంతో గ్రామ, పట్టణాల్లో సొంతూరిలోనే సొంత ఇళ్లు నిర్మించుకునేలా కొత్త పథకాన్ని అమలు చేయబోతున్నారు. ఇంటి స్థలం ఉండి ఇళ్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయం చేస్తారు. అసలే స్థలంలేని పేదలకు 75 గజాల ఇంటి జాగ ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలిస్తారు.

33 మంది పేదలకు అవకాశం

ఉమ్మడి మెదక్ జిల్లాలో 33 వేల మంది పేదలకు సొంతింటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందనుం ది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేల కుటుంబాలకు లబ్ధి చేకూర నుంది. సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, సంగారెడ్డి నియోజవర్గాల్లో 15 వేలు, సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్ధిపేట, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో 12 వేలు, మెదక్ జిల్లాలో నర్సాపూర్, దుబ్బాక నియోకవర్గాల్లో 6 వేల చొప్పున పేదలకు సొంతింటి కళ నెరవేరనుంది. డబులత్ బెడ్‌రూం ఇళ్ల పథకం కింద మండలంలోని ఒకటి రెండు చోట్ల ఎంపిక చేసిన స్థలంలో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. పట్టణాల్లో తప్ప గ్రామాల్లో కట్టిందిలేదు. గృహాలక్ష్మి పథకంలో గ్రామ, పట్టణాల్లో ఇంటి స్థలం ఉన్న పేదలందరికీ ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలిస్తారు. స్థలంలేని పేదలకు ప్రభుత్వమే 75 గజాల స్థలమిచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలివ్వనుంది.

విధి విధానాలపై కసరత్తు

గృహాలక్ష్మి పథకం కింద లబ్దిదారుల్ని ఎంపిక చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరీలో పాటించిన నిబంధనలే ఉండనున్నాయి. ఇంటి స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేని పేదలకు తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకంలో లబ్దిపొందకూడదు. ఇళ్ల స్థలాల్లేని పేదలకు జాగలిచ్చేందుకు అవసరమైన భూముల్ని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఎన్నికల ఇయర్ కావడంతో పేదలకు ఇళ్లు కట్టించేందుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

మూడు దశల్లో పేమెంట్స్

ఖాళీ స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే ఆర్థిక స్థోమతలేని పేదలను ఈ పథకం కింద గుర్తించనున్నారు. ఎంపిక చేసిన లబ్దిదారుడు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు చెల్లిస్తారు. ఇంటి నిర్మాణానికి మూడు దశల్లో పేమెంట్ చేస్తారు. బేస్‌మెంట్ లెవల్ వరకు రూ.1 లక్ష, గోడల నిర్మాణం జరిగా స్లాబ్ లెవల్‌కు మరో లక్ష, స్లాబ్ వేశాక చివరి పేమెంట్ మరో లక్ష ఇస్తారు. ప్రతి సారి పేమెంట్ చేసే ముందు ఇంటి నిర్మాణానికి సంబంధించి పోటోలు తీస్తారు. ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన పిదపనే డబ్బుల చెల్లింపులు జరుగుతాయి. ఇందు కోసం ఇప్పటికే డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న హౌసింగ్ అధికారులు, సిబ్బందిని వినియోగించనున్నారు. సైట్ ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు అవసరమనుకుంటే అవుట్‌సోర్సింగ్ పద్దతిలో కొందర్ని తీసుకునే అవకాశముందంటున్నారు.

స్థలం లేని పేదలకు స్థలాలు

పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటి స్థలం లేని పేదలున్నారు. వీరిని గుర్తించి అర్హులైన పేదలకు 75 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలిస్తారు. సంగారెడ్డి జిల్లాలో 10 వేల మంది ఇళ్లు, స్థలాల్లేని పేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. వీరిలో రెండు వేల మందికి కూడా ఇళ్లు రాలేదు. సదాశివపేట, సంగారెడ్డి, కంది, చేర్యాల, మెదక్, సిద్దిపేట, కొమరవెల్లి, గజ్వేల్, నర్సాపూర్ వంటి ప్రాంతాల్లో పేదలు గుడిసెలు వేసి పోరాటం చేశారు. అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలు, ఆర్‌సీపురం, గుమ్మడిదల, జిన్నారం మండలాల్లో వేలాది మంది పేదలు ఇళ్లు, స్థలాల్లేక ఉన్నారు. ఐలాపురం, ఐలాపురం తండాలో వేలాది మంది అసైన్డ్ భూమిలో ఇళ్లు కట్టుకుంటే కూల్చేశారు. వారందరికీ స్థలాలు, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.

కార్మికులకు ఎల్లవేళలా సీఐటీయూ అండ



- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్







నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికుల పక్షాన ఉంటూ.. వారి హక్కుల రక్షణ కోసం సీఐటీయూ ఎల్లవేళలా పోరాడుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం పటాన్‌చెరులోని శ్రామిక భవన్‌లో జరిగిన సెమినార్‌లో మల్లికార్జున్ మాట్లాడుతూ.. సీఐటీయూ ఏర్పడిన తర్వాతనే దేశంలో ఐక్య పోరాటాలు వచ్చాయని, కార్మికులు ఐక్యమయ్యారని గుర్తు చేశారు. పాలకులు తెచ్చే కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయు అని అన్నారు. ఐక్యత, పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడిందన్నారు. దేశం కోసం, ప్రజల కోసం, నిరుద్యోగుల కోసం, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా, విచ్ఛిన్నకర ఉద్యమాలకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు కే రాజయ్య, పాండురంగా రెడ్డి, వాజీద్ అలి, సుధాకర్, శ్యామ్, సంతోష్, రామ కష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో ఐక్య కార్మిక ఉద్యమాలకు సారథి సీఐటీయూ

నవతెలంగాణ-సంగారెడ్డి, కొండాపూర్: సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సుందరయ్య భవన్ సీఐటీయూ జిల్లా కార్యాలయం ఎదుట, అలాగే కొండాపూర్ మండలంలోని యూబీ పరిశ్రమ వద్ద సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బీరం మల్లేశం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970లో సీఐటీయూను ఆనాడు బీటీ రణదీవే, పి. రామమూర్తి, సీఐటీయూను ఏర్పాటు చేశారన్నారు. ఆనాటి నుండి నేటి వరకు కార్మికులకు, కర్షకులకు అండగా ఉంటూ ఎన్నో పోరాటాలను చేశామన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, కార్మిక చట్టాలను విస్మరిస్తున్నదన్నారు. స్వాతంత్రం రాకముందుకున్నటువంటి 44చట్టాలను కూడా మార్చివేస్తూ కార్మికులకు అన్యాయం చేసి నాలుగుకోడ్ లు గా విభజించారని.. మార్చిన కార్మిక చట్టాల కోసం మరో పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కాంట్రాక్టు కార్మికుడై లేకుండా చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత, దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్న సందర్భంలో మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న పేద దళిత, బిసి,మైనార్టీ, ఉద్యోగ, కార్మికుల్ని వెంటనే పర్మిట్ చేయాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో జిల్లా కార్యదర్శి జి. సాయిలు నాయకులు మాణిక్యం, యాదగిరి, రాజిరెడ్డి, ఎల్లమ్మ, నాగరాజు, యాదగిరి, సంగీత, సువర్ణ, నర్సింలు, యాదయ్య, దుర్గయ్య, కొండాపూర్‌లో సీఐటీయూ నాయకులు కొండల్ రెడ్డి, రాందాస్, సుధాకర్, రమేష్, శ్రీధర్, దయానంద్, మోహన్ రెడ్డి, లక్ష్మీకాంత్, ప్రవీణ్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

నవతెలంగాణ కొండపాక : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్‌నర్సయ్య కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం రోజున విశ్వనాథ్ పల్లి రవీంద్ర నగర్ కార్మిక కర్షక భవన ఆవరణలో సీఐటీయూ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల నరసయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో తొమ్మిది ఏళ్లుగా సరళీకృత ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తుందని అన్నారు. సంఘటిత, అసంఘటిత రంగ ఉద్యోగులు, కార్మికుల జాతీయ సమ్మెలు, రాష్ట్రవ్యాప్త పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయని తెలిపారు. కార్మిక వర్గ ఐక్యతను పక్కదారి పట్టించేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో బర్మ కొమురయ్య జాలిగామ ప్రభాకర్ గొడుగు నారాయణ ఆరుట్ల నర్సింలు పెళ్లి లచ్చవ్వ పల్లె శ్రీనివాస్ కలవ్వ వెంకటవ్వ లక్ష్మి పుష్ప చంద్రం ఐలయ్య రాజు సుధాకర్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు

కార్మికవర్గ రాజ్యం ఏర్పాటే సీఐటీయూ లక్ష్యం

నవ తెలంగాణ-దుబ్బాక: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన్నాటినుండి నేటికీ బడా బూర్జువా, భూస్వామిక ప్రభుత్వాలే ఈ దేశాన్ని పాలిస్తున్నాయని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ విమర్శించారు. 53 ఏళ్ల నుండి దేశంలోని అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై అలుపెరుగని సమరశీల పోరాటాలు చేస్తున్నది, కార్మికుల హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నది సీఐటీయూ మాత్రమేనని స్పష్టం చేశారు. మంగళవారం సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దుబ్బాక పురపాలిక కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం మతోన్మాద విధానాలతో కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాస్తోందన్నారు. సామాన్య, కార్మిక వర్గ ప్రజల మధ్య చీలికలు చేస్తూ పాలిస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాద పార్టీలు, ప్రభుత్వాలకు సరైన బుద్ధి చెప్పేందుకు దేశ కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సిఐటియు దుబ్బాక టౌన్ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, పలు రంగాల కార్మికులు మల్లేశం, శ్రీనివాస్, కృష్ణ, పరశురాం, జమున, రాధిక పలువురు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్‌ను సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనే ఉంచాలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-సంగారెడ్డి

వైద్య విధాన పరిషత్(డీసీహెచ్ఎస్) సంగారెడ్డి జిల్లా ఆఫీస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించాలనే ఆలోచన విరమించుకోవాలని.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోనే వైద్య విధాన పరిషత్ జిల్లా ఆఫీస్ ఉంచాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన కేవీపీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఉండేదని.. సంగారెడ్డికి మెడికల్ కాలేజ్ మంజూరైన తర్వాత జిల్లా ఆసుపత్రినే మెడికల్ కాలేజ్ గా మార్చారన్నారు. జిల్లా ఆస్పత్రిలో పనిచేసిన స్టాఫ్ నర్స్ ఉద్యోగులు సిబ్బంది సుమారు 300 మందికి పైగా ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలోనే విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారి జీత భత్యాలు వారి సర్వీస్‌కు సంబంధించిన సమస్యలు వైద్య విధాన పరిషత్ జిల్లా ఆఫీసులోనే పరిష్కారం అవుతున్నాయన్నారు. ప్రస్తుతం డి.సి.హెచ్.ఎస్ ఆఫీస్ జనరల్ హాస్పిటల్ సూపరిటెండెంట్ ఆఫీస్‌లోనే కొనసాగుతుందన్నారు. అయితే జనరల్ హాస్పిటల్ సిబ్బందికి రూములు సరిపోవడం లేదని డిసిహెచ్ఎస్ ఆఫీస్ ఇక్కడి నుంచి ఖాళీ చేయాలని అధికారులు చెబుతున్నారన్నారు. దీంతో డిసిహెచ్ఎస్ ఆఫీస్‌ను జోగిపేట్, పటాన్చెరువు, సదాశివ పేటలకు కార్యాలయాన్ని మార్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది ఉద్యోగులకు ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఉందన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం లోని జనరల్ ఆస్పత్రి ఆవరణంలోనే డిసిహెచ్ఎస్, డిఎంహెచ్ఓ, జనరల్ ఆస్పత్రి ఆఫీస్‌లన్ని కలిసి ఒకే దగ్గర ఇంటిగ్రేటెడ్ ఆఫీసుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సిబ్బందికి అధికారులు అందుబాటులో ఉండే సౌలభ్యం ఉంటుందన్నారు. డిసిహెచ్ఎస్ జిల్లా ఆఫీసును ఇతర ప్రాంతాలకు తరలిస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఇతర ప్రాంతాలకు ఆఫీసును తరలించాలని ఆలోచన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు దాస్, నాయకులు దత్తు, సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో చేర్యాల డివిజన్ సాధన కోసం పోరాటం

- జూన్ 2న డివిజన్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- జేఏసీ, అఖిలపక్ష నాయకులు



నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో చేర్యాల డివిజన్ సాధన కోసం పోరాటం చేస్తామని, జూన్ 2న రెవెన్యూ డివిజన్ కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, అఖిలపక్ష నాయకులు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆది శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య తెలిపారు. చేర్యాల పట్టణంలోని వాసవి గార్డెన్ లో మంగళవారం జేఏసీ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఒకప్పుడు ఘనమైన చరిత్ర కలిగిన చేర్యాల ప్రాంతం హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్, ఆలేరు పట్టణాల కంటే ఎంతో ముందు వరుసలో ఉండి పంచాయతీ సమితిగా నియోజకవర్గ కేంద్రంగా, ఒక తాలూకా గా ఉండి తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వచ్చిన చేర్యాల నేడు మసకబారిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇందుర్తి నియోజకవర్గం పేరుతో ఉన్నటువంటి హుస్నాబాద్ నేడు నియోజకవర్గ కేంద్రంతో పాటు రెవెన్యూ డివిజన్ కూడా సాధించుకుందన్నారు.మొన్నటిదాకా నియోజకవర్గం కేంద్రంగా ఉన్న గజ్వేల్ నేడు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా పరిడవిల్లుతుందన్నారు.గత చరిత్ర తిరిగేసుకుంటే 60 సంవత్సరాల క్రితమే నల్గొండ జిల్లాలో చేర్యాల ఒక మున్సిపాలిటీగా, వరంగల్ జిల్లాలో దశాబ్దాల తరబడి నుండి పంచాయతీ సమితిగా, తాలూకా కేంద్రంగా, అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేదన్నారు. ఇంత ఘనమైన చరిత్ర కలిగిన చేర్యాల నేడు పాలకుల నిరాదరణకు గురై ఒక చిన్న మండలానికి కుదిరించబడి అస్తిత్వాన్ని కోల్పోయి పూర్తిగా మసకబారి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఊపిరి పోసుకున్న బిడ్డలుగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకమైన పాత్ర పోషించిన ఉద్యమకారులుగా చేర్యాలకు గత పూర్వం వైభవాన్ని తీసుకురావడం కోసం చేసే కృషిలో భాగంగా రెవెన్యూ డివిజన్ సాధన కోసం తెలంగాణ రాష్ట్ర ఉద్యమ స్ఫూర్తితో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజైన జూన్ 2న చేర్యాల పాత నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ అందరి తో కలిసి చేర్యాల పట్టణంలోని వాసవి గార్డెన్ లో జూన్ 2 న విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమావేశంలోనే చే ర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. ఈ విస్తృత స్థాయి సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి,మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, దాసరి కళావతి, మాజీ సర్పంచ్ అవుశర్ల యాదయ్య, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తడక లింగం గుప్త, అఖిలపక్షం,జేఏసీ నాయకులు ఈరి భూమయ్య, కాటం మల్లేశం, తాడెం ప్రశాంత్, పుట్ట రాజు, గూడ రాజిరెడ్డి, బిజ్జ రాము, బండి సుదర్శన్, రిటైర్డ్ ఉద్యోగులు బుట్టి బాగయ్య, శ్రీరామ్ మల్లేషం, ఉడుగుల శ్రీనివాస్, బండకింది అరుణ్ కుమార్, తాడెం వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చతుర్ముఖ పోటీ

- ఎమ్మెల్యే రేసులో జెడ్పీటీసీ విజయ్‌కుమార్
- మెదక్ నియోజకవర్గం బీసీలకు కేటాయించే యోచనలో అధిష్టానం



నవతెలంగాణ- నిజాంపేట

భారత రాష్ట్ర సమితి పార్టీలో రోజురోజుకు మెదక్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ పెరుగుతోంది. మెదక్ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ నాకే వస్తదంటూ ప్రచారం చేసుకుంటున్నారు. టికెట్ విషయంలో ముగ్గురు కొట్లాడితే నాలుగో వ్యక్తికి కేటాయించే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ పలువురు చర్చించుకుంటున్నారు. మెదక్ నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గం ఓటర్సు అధికంగా ఉన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని బీసీ సామాజిక వర్గాలకుల కేటాయిస్తారని ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్‌రావు, పద్మా దేవేందర్‌రెడ్డి, నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ టికెట్ రేసులో ఉన్నారు. అధిష్టానం టికెట్టు నాకే ఇస్తదంటూ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ మెదక్ నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే తనకే అవకాశం వస్తుందని నిజాంపేట జెడ్పీటీసీ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మెదక్ నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలలో నిజాంపేట జెడ్పీటీసీ ఐదు సంవత్సరాల నుంచి చురుకుగా పాల్గొంటున్నారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్ కోసం కూడా పాదయాత్ర చేసి పలువురి మన్ననలను పొందారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల సర్పంచులను, ఎంపీపీలను, ఉద్యమ నాయకులతో టచ్‌లో ఉంటున్నారు.

4న దళితుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ దుబ్బాక రూరల్

ఈ నెల 4న జరిగే దుబ్బాక నియోజకవర్గ దళిత ఆత్మీయ సమ్మేళనానికి దళితులు పెద్ద ఎత్తున తరలిరావాలని అక్బరుపేట భూంపల్లి మండల అధ్యక్షులు జీడిపల్లి రవి పిలుపునిచ్చారు. మంగళవారం అక్బరుపేట్ భూంపల్లి మండలంలోని ఎస్బీఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో దుబ్బాక నియోజకవర్గ దళిత సమ్మేళన కమిటీ వారి వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ దళిత ఆత్మీయ సమ్మేళన కమిటీ అధ్యక్షులు అస యాదగిరి, గౌరవ అధ్యక్షులు కరికే శ్రీనివాస్ ర్యాకం శ్రీరాములు, విజిలెన్స్ కమిటీ మెంబర్ యెరుమని దుబ్బరాజం పాస్తం, వెంకటేష్ కన్వీనర్స్ కో కన్వీనర్స్. చారువక కుమార్ , ఏకలవ్య సంఘ అధ్యక్షుడు వనం రమేష్ అక్బర్పేట్ భూంపల్లి మండల అధ్యక్షులు జీడిపల్లి రవి దళిత సర్పంచులు ఎంపీటీసీలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము కాల్వ నరేష్ వైఎస్ చైర్మెన్ మార్కెట్ కమిటీ వైస్ చేర్మెన్ చెక్కపల్లి పద్మయ్య పాల్గొన్నారు.


చెరువు కాదిది.. నిర్మితమవుతున్న రహదారి

నవతెలంగాణ-కోహెడ





సిద్దిపేట హన్మకొండ జాతీయ రహదారి పనులు ఇటీవలే ప్రారంభమై కొనసాగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కొన్నిచోట్ల గోతులు, మరి కొన్ని చోట్ల పొలాలను సరిచేస్తూ రోడ్డు కిరువైపులా పెద్ద పెద్ద కందకాలను తవ్వారు. ఇంతవరకు బాగానేఉన్నా మంగళవారం ఉదయం కురుస్తున్న వర్షానికి రోడ్డంతా చిత్తడిగా మారింది. కొన్నిచోట్ల నీటి కుంటలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మరీ ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అటువైపు వెళ్లడానికి జంకుతున్నారు. రహదారి వెంబడి నాగసముద్రాల, బస్వాపూర్, బద్దిపడగ వరకు రోడ్డు విస్తరణ పనులు చేయడం మూలంగా ఆదివారం వరకు దుమ్ము ధూళితో.. నేడు ఇలా చెరువులు తలపించేలా రోడ్డు తయారవడం వాహనదారుల పాలిట శాపంగా మారింది. కొత్తగా ఇటీవలే కార్లు తీసుకున్న వారైతే ఈ రోడ్డును విడిచిపెట్టి నాగసముద్రాల క్రాస్ నుంచి నంగునూరు మీదుగా వాహనాలను మళ్లించుకొని వెళ్తున్నారు. వాహనచోదకుల ఇబ్బందులను గుర్తించి ఇప్పటికైన తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కొల్లూరు నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామచంద్రాపురం



తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న కొల్లూరు పోలీస్ స్టేషన్ భవనాన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. నూతన భవనం ఏర్పాటయ్యే వరకు.. తాత్కాలిక పోలీస్ స్టేషన్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో పోలీస్ స్టేషన్ ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నూతన పోలీస్ ఏర్పాటుతో తెల్లాపూర్, ఉస్మాన్ నగర్, కొల్లూరు ప్రజలకు పోలీస్ శాఖ సత్వర సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజయ్, స్థానిక కౌన్సిలర్ చిట్టి ఉమేష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎస్‌హెచ్‌డీసీ చైర్మెన్ చింతా ప్రభాకర్

నవతెలంగాణ-సంగారెడ్డి



జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ మంగళవారం కలెక్టర్ డాక్టర్ శరత్‌ను కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై కలెక్టర్ తో చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. కుల సంఘాల జిల్లా ఆత్మగౌరవ భావనలకు స్థలం కేటాయించాలని చింత ప్రభాకర్‌తో కలసి కుల సంఘం నేతలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మున్నూరు కాపు, నాయి బ్రాహ్మణ, విశ్వకర్మ మన్మయ, బ్రాహ్మణ, గాండ్ల సంఘాల జిల్లా భావనలకు స్థలం కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మెన్ విజేందర్ రెడ్డి, విష్ణువర్ధన్, ప్రశాంత్ ,వివిధ కుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కల్హేర్



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని.. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నదని నారాయణఖేడ్ శాసనస భ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. నిజాంపేట మండలంలోని నాగ్ దార్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు క్యాంపు శిబిరాన్ని మంగళ వారం ఆయన ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్ష నిర్వహించ విధానాన్ని పరిశీలించి.. మొదట కంటి పరీక్షలు చేయించుకున్నారు. తర్వాత కంటి పరీక్షలు నిర్వహించిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా కండ్లద్దాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవనాన్నరు. గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ అంధత్వ నిర్మూలన కోసం కంటి వెలుగు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కావున 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు గుర్రపు సుశీల అంజ య్య, జంగం శ్రీనివాస్, ఖేడ్ జడ్పిటిసిలు లక్ష్మీబాయి రవీందర్ నాయక్, నరసింహారెడ్డి, సర్పంచ్ రవిల మధుకర్, ఉప సర్పంచ్ అడవప్ప, పేట మండల పార్టీ అధ్యక్షుడు మురళి పంతులు, మండల వైద్యాధికారులు స్టాలిన్ జోనా, అనిల్ రెడ్డి, క్యాంపు మెడికల్ ఆఫీసర్ పవన్ కళ్యాణ్, రైతు సూపర్వైజర్ మాణిక్యం, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్, ఆప్తమార్టిస్ట్ గీత, క్యాంపు డీఈవో సంగమేష్, ఏఎన్ఎంలో బాలమణి, మంజుల, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- కార్మికులకు అండా.. సీఐటీయూ జెండా
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళ వారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా కాజిపల్లిలోని టీఐడీసీ మరియు బొల్లారంలోని హూతమాకి పీపీఎల్ పరిశ్రమల వద్ద జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య పాల్గొని మాట్లాడారు. 'కార్మికులకు అండా.. సీఐటీయూ జెండా' అని.. ఐక్యత, పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పడిందన్నారు. సీఐటీయూ ఏర్పడిన తర్వాతనే దేశంలో ఐక్య పోరాటాలు వచ్చాయని.. కార్మికులు ఐక్యమయ్యారని గుర్తు చేశారు. దేశం కోసం, ప్రజల కోసం, నిరుద్యోగుల కోసం, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా, విచ్ఛిన్నకర ఉద్యమాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడుతున్నదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉ ద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్, కుమార్, ప్రతాపరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శేఖర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : దేశవ్యాప్తంగా కార్మిక వర్గ హక్కుల కోసం వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం సీఐటీయూ మాత్రమే అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్ కుమార్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎంఆర్ఎఫ్, పెట్ పెన్సర్, బ్లూ క్రాఫ్ట్ పరిశ్రమల వద్ద జెండాలను ఎగర వేశారు. అనంతరం సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. తదనంతరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. 1970 సంవత్సరం మే 30న సీఐటీయూ ఏర్పడిందన్నారు. నాటి నుంచి గత 53 ఏండ్లుగా దేశంలో ఉన్న కార్మిక ఉద్యోగ హక్కుల కోసం అవిశ్రాంత పోరాటాలు చేస్తున్నదన్నారు. సీఐటీయూ అంటేనే కార్మికుల పక్షపాతి అన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక హక్కులకు భంగం వాటిల్లే పరిస్థితి వస్తుందని.. రాబోయే కాలంలో కార్మికులను ఐక్యం చేసి కార్మిక చట్టాల రక్షణ కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. నాయకులు నర్సింలు, రాజు, కృష్ణమూర్తి, విజయవీర్, శ్రీకాంత్, మల్లేశం, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.









జహీరాబాద్ : కార్మికుల రక్షణ కోసం పుట్టుకొచ్చిన సీఐటీయూ.. ఎల్లవేళలా కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ అన్నారు. మంగళ వారం స్థానిక కార్యాలయంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం కార్మికుల పక్షాన నిలబడుతూ.. వారి సంక్షేమం కోసం పుట్టుకొచ్చిందే సీఐటీయూ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జోగిపేట : జోగిపేట కేంద్రంలో సీఐటీయు జెండాను సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు, పేదలకు, రైతులకు అనునిత్యం అండగా ఉంటున్న సిఐటియు అనేక పోరాటాలు చేసి విజయం సాధించిన చరిత్ర సీఐటీయూకు ఉందన్నారు. నాయకులు మల్లన్న, ఆంజనేయులు, అలీ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



పార్టీలకతీతంగా దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జోగిపేట

పార్టీలకతీతంగా ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నదని, అందుకు అనుగుణంగా దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సూచించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆందోల్ నియోజకవర్గ స్థాయి అధికారులతో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీ నుండి 22 వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో నియోజకవర్గ పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతుల కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకు వచ్చారన్నారని.. వీటన్నింటిని రైతులకు వివరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, అందోల్ ఎంపీపీ బాలయ్య, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, నియోజకవర్గస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గీతం పరిశోధక విద్యార్థి అబ్దుల్ రెహ్మాన్ ఉజేర్‌కు డాక్టరేట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యంపై విశ్లేషణ, దానిపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన హైదరాబాద్, గీతం డీమ్డ్ విశ్వవిద్యా లయంలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి (రీసెర్చ్ స్కాలర్) మహమ్మద్ అబ్దుల్ రెహ్మాన్ ఉజేర్ కు డాక్టరేట్ వరించింది. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.సీతారామయ్య, సహ పర్యవేక్షకుడు ప్రొఫెసర్ బి.బస్వరాజు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అబ్దుల్ రెహ్మాన్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్ డి పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం,హై దరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డై రెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు ఆయనను అభినందించారు.

గీతం ప్రాంగణంలోని చెట్లకు జియో-ట్యాగ్..



గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని చెట్లు, మొక్కలు, పొదలు, తీగ జాతులకు మంగళవారం జియో-ట్యాగ్ చేశారు. వాటికి అమర్చిన క్యూ-ఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా ఆయా మొక్కల వృక్షశాస్త్ర, సాధారణ పేర్లతో కూడిన వివరాలతో పాటు వాటి వర్గీకరణ, పుష్ప లేదా ఫలాల వివరాన్నీ లభిస్తాయి. గత మూడు నెలలుగా శ్రమించి, గీతం మూడు ప్రాంగణాలలోని చెట్ల జాతులకు క్యూఆర్ కోడ్లను ట్యాగ్ చేస్తున్నట్టు గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, విశాఖపట్నం సీనియర్ ప్రొఫెసర్ కె.మోహన్ తెలియజేశారు.ఈ జియో-ట్యాగింగ్ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్,హై దరాబాద్ డై రెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రూ.70 లక్షల సీసీరోడ్డు పనులకు భూమి పూజ

నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ మున్సిపాల్టీలో రూ.70 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మంగళవారం భూమి పూజ చేశారు. ఆందోల్ మున్సిపాల్టీ పరిధిలో డిఎల్ ఫంక్షనల్ నుంచి మజీద్ రోడ్డు వరకు నిర్మిస్తున్న పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాల్టీ అభివృద్ధికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తున్నదని, సిసి రోడ్లు, మురికి కాలువలు, ఇతర పనులను చేపడుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ఒక్కొక్క మున్సిపాల్టీకి రూ.25 కోట్లు మంజూరు చేశారన్నారు. అనంతరం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య వైస్ చైర్మన్ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు సాయికుమార్, అశోక్, వెంకటేశం,మహేష్, గోపాల్, సత్యం,సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై అన్నదాతల ఆవేదన..

- ధాన్యం కొనుగోలు చేసి.. మిల్లులకు తరలించాలని రైతుల రాస్తారోకో
- జోగిపేటలో రోడ్డుపై లారీలను అడ్డుకున్న రైతులు
- గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద నిరసన

నవతెలంగాణ-జోగిపేట

ధాన్యాన్ని తూకం వేయడంలో నిర్లక్ష్యం, లారీల కొరత కారణంగా తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని జోగిపేట తహసిల్దార్ కార్యాలయం, అందోల్ పీఏసీఎస్ కార్యాలయం ప్రధాన రహదారిపై రెండు చోట్ల రైతులు మంగళ వారం రోడ్డెక్కారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా.. తూకం వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని సెంటర్‌లలోనే ఉంచుతున్నారన్నారు. కాగా అకాల వర్షాలు పడుతుండడంతో రోజుల తరబడి ధాన్యాన్ని కాపాడుకోవడం కష్టంగా మారతున్నదని రైతులు వాపోయారు. వెంటనే వారి ధాన్యాన్ని తూకం వేసి.. రైస్ మిల్లర్‌లకు తరలించాలని కోరారు.

రైతుల రాస్తారోకోకు సీపీఐ(ఎం) నాయకుడు విద్యాసాగర్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశం, గోహేర్ అలీలు మద్దతు తెలిపి రాస్తారోకోలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తూకం వేసిన ధాన్యాన్ని తక్షణ మే రైస్ మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించడం కోసం 20 రోజులుగా వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకస్మికంగా కూరుస్తున్న వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జోగిపేటలో రాస్తారోకో వద్దకు తహసిల్దార్ వెంకటేశం, డిప్యూటీ తహసిల్దార్ మధుకర్ రెడ్డి, ఎస్సై సామ్యా నాయక్‌లు వచ్చి రైతులను శాంతించే ప్రయత్నం చేశారు. అటుగా వెళుతున్న రెండు లారీలను రైతులు అడ్డుకొని తమ గ్రామానికి తీసుకెళ్లారు. అనంతరం లారీ ఓనర్‌తో తహసిల్దార్ వెంకటేష్ మాట్లాడి పోసానిపేట గ్రామానికి పంపించారు. లారీల సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటానని హామీనివ్వడంతో రైతులు తమ రాస్తారోకోను విరమించారు.





గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద రైతుల నిరసన..

నవతెలంగాణ-గుమ్మడిదల

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాలు రాక రైతులు ఆరబెట్టుకున్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేయలేక పోతున్నారని వెంటనే ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద రైతులతో కలిసి కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ.. రైతు పక్షపాతి అని చెప్పుకునే సీఎం కేసీఆర్‌కు.. ప్రస్తుతం రైతులు పడుతున్న ఇబ్బందులు కనబడడం లేదా అని ప్రశ్నించారు. అధికారులు వెంట నే స్పందించి గ్రామాలలో ఉన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. సెంటర్‌లలో సంచుల కొరత ఉన్నదని.. రైతులకు సరిపడు సంచులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేని రైతులు తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.ఈ నిరసనలో ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, రైతు సంగం అధ్యక్షుడు పి మోహన్ రెడ్డి, మైపాల్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రంగారెడ్డి, దయాకర్ రెడ్డి, సందీప్, అఖిల్, రాజు, వీరయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సిఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో రేపు జాబ్ మేళా

నవతెలంగాణ-సంగారెడ్డి

హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ వారు నిర్వహిస్తున్న టెక్ బీ ప్రోగ్రాం కోసం రేపు(గురువారం) జాబ్ డ్రైవ్‌ను స్థానిక ఎస్‌వి జూనియర్ కాలేజ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్. గోవింద రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సును 2022 అండ్ 2023లో పూర్తిచేసి ఉండాలన్నారు. ఇంటర్ స్థాయిలో మ్యాథమెటిక్స్ లేదా బిజినెస్ మ్యాథమెటిక్స్ ఎంపీసీ, ఎంఈసి ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలన్నారు. మ్యాథమెటిక్స్/బిజినెస్ మ్యాథమెటిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో పూర్తికాల ఉద్యోగులుగా నియమించుకుంటారన్నారు. కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేసేటప్పుడు అభ్యర్థికి నెలకు రూ.10 వేల చొప్పున స్టయిఫండ్ చెల్లిస్తారన్నారు. పూర్తిస్థాయి ఉద్యోగిగా ఎంపికైతే.. ప్రారంభ వార్షిక వేతనం రూ.1.70 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు చెల్లిస్తారన్నారు. హెచ్‌సీఎల్‌లో పూర్తిస్థాయి ఉద్యోగం చేస్తూనే బిట్స్ పిలాని, ఎస్ ఏ ఎస్ ఆర్ ఏ, అమిటీ, కేఎల్ ఐఐఎం నాగపూర్ యూనివర్సిటీలలో ఉన్నత విద్య కోర్సులో చేరే అవకాశం కూడా ఉందన్నారు. పదో తరగతి పాస్ సర్టిఫికెట్ నకలు, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ నకలు ఆధార్ కార్డు నకలు, ఒక ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. https://bit.ly/HCLTB-Telangana ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్ చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు రాఘవేంద్ర హెచ్.సి.ఎల్ ఎరియా ప్రతినిధిని 91 9063564875, 91 9014600354 నెంబర్‌ల ద్వారా సంప్రదించాలన్నారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకోరా?

- విద్యుత్ అధికారులపై తీరుపై సర్పంచుల ఆగ్రహం

నవతెలంగాణ-వట్‌పల్లి

గ్రామాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయని.. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కోవడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ పత్తి కృష్ణవేణి నరసింహులు అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావే శము నిర్వహించారు. 21 మంది సర్పంచ్‌లకు గాను ఆరుగ ురు, 9 మంది ఎంపీటీసీలకు గాను ఆరుమంది ఎంపీటీసీలు మాత్రమే సమావేశంలో పాల్గొన్నారు. అధికారులు కూడా కొంత మందే హాజరు కాగా.. పావుగంటలో సమావేశం ముగుస్తుందన్నప్పుడు మరికొంతమంది సమావేశంలో పాల్గొన్నారు.

కాగా సమావేశంలో గౌతాపూర్ గ్రామం సర్పంచ్ మహమ్మద్ ఖయ్యూం పాషా మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా మారి.. ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. గౌతాపూర్‌లో అంగన్వాడి కేంద్రం మంచిర్యాల తండాలో వాటర్ ట్యాంక్ వట్పల్లి నుండి దుద్యాల వరకు పంచాయతీరాజ్ రోడ్డు కంకర వేసి బీటీ వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే 2022లో మండలానికి మంజూరైన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు అద్దె భవనము లభించకపోవడంతో ఇక్కడ పాఠశాల ఏర్పాటు రద్దయి పోయిందని మండల విద్యాధికారి తెలిపారు. పలువురు ప్రజాప్రతి నిధులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమయపాలన పాటిం చాలని ఎంపీపీ కోరారు. సమావేశం ముగిసే సమయానికి రావడం సరికాదన్నారు. ఇకముందు ఇలాంటివి పునరా వృతం కాకుండా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగదీశ్వర్, వైస్ ఎంపీపీ నాగరాణి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు నర్సింలు, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఏఈలు, అంగన్వాడి సూపర్వైజర్లు, పంచాయతీరాజ్ ఏఈ, మండల ఇన్చార్జి విద్యాధి కారి, ఐకేపీ ఏపీఎం, ఈజీఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షులుగా శ్రీనివాస్

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షులుగా డి.శ్రీనివాస్‌ను, ప్రధాన కార్యదర్శిగా రవికాంత్‌ను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్టు మాజీ అధ్యక్షులు మొగుల య్య గౌతమ్ తెలిపారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని సబ్ స్టేషన్ ముందు ఉన్న అంబేద్కర్ భవన స్థలం వద్ద ఈ ఎన్నికలు జరిగాయన్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ రంగ సంస్థల నందు ప్రైవేటు పరిశ్రమల నందు విధులు నిర్వహి స్తున్న ఉద్యోగస్తులు, కార్మికులందరూ కలసి నూతన కార్యవ ర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన డి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతోనే అభి వృద్ధి సాధ్యం సభ్యులందరూ కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయంలో స్వార్థాన్ని పక్కనపెట్టి సమాజసేవ చేయాలి



నవతెలంగాణ-ఝరాసంగం

మనమందరం నిస్వార్థ సేవతో పని చేయాలని, రాజకీయంలో స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి నిస్వార్థంగా సమాజ సేవ చేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం ఝరాసంగం మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో గల శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం కోసం ఏదో ఒకటి చేయాలని తమ ఆస్తులను సైతం అమ్ముకొని నిస్వార్థంగా ముందుకు వచ్చిన మహానుభావులు ఎందరో ఉన్నరన్నారు. ఇతరులకు ఉపకారం చేయకపోయినా అపకారం మాత్రం చేయకూడదన్నారు. అలాంటి మార్పు కోసమే తాము ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి బుద్ధిమంతులుగా తయారు చేయడం అభినందనీయమన్నారు. ముందుగా వారికి ఆశ్రమ వైదిక పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జ్యోతిర్లింగాల వద్ద రుద్రాభిషేకం మహా మంగళారతి నిర్వహించారు. వారికి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ 108 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వర స్వామి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట జహీరాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మొగడంపల్లి ఆశప్ప, నాయకులు గోపాల్ రెడ్డి,గడ్డబాయి విఠల్,శాఫి తదితరులు ఉన్నారు.

డిగ్రీ తర్వాత సమయాన్ని వృథా చేయొద్దు

నవతెలంగాణ-జహీరాబాద్



డిగ్రీ పూర్తైన తర్వాత ఒక్క సంవత్సరం కష్టపడి ఉన్నత విద్యను అభ్యసిస్తే జీవితంలో మంచి స్థానాన్ని, సమాజంలో గౌరవాన్ని పొందుతారని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. స్థానిక ఆచార్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం ఆశీర్వాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ పట్టణ ఎస్సై శ్రీకాంత్, రిసొన్స్ సంస్థల డీన్ విద్యాసాగర్‌లు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు డిగ్రీ అనంతరం సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో సమయపాలనతో తెలివిగా చదివినట్లయితే ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొంది తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితం అనేది డిగ్రీ అనంతరమే మొదలవుతుంద న్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా లక్ష్యాన్ని మరచిపోని వారే ఉన్నత శిఖరా లకు వెళారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ హరికుమార్, డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అధ్యా పకులు రామచందర్, నర్సింలు, నందుగౌడ్, దత్తు, రమేష్, వెంకటేశం, నవీన, ఇర్షాద్ సుల్తానా, నికిత, లావణ్య, శ్వేత విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీలో కాలుష్యం తీవ్రంగా పెరిగిపోతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ గడ్డపోతారం గ్రామపంచాయతీ ప్రధాన కూడలి వద్ద పారిశ్రామిక రహదారిపై గ్రామస్తులు మంగళవారం మూకుమ్మడిగా బైటాయించారు. కాలుష్య సమస్యకు శాశ్వతంగా పరిష్కారం కోసం వెంటనే అధికారులు, యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధిలోని పరిశ్రమలు విచ్చలవిడిగా తీవ్రమైన వాయు కాలుష్యాన్ని వెదజల్లుతుండడంతో గత నెల రోజుల నుండి తీవ్ర ఇబ్బందికి గురికావాల్సి వస్తోందన్నారు. వాయు కాలుష్యం అధికమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొందరైతే అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని వాపోయారు. సదరు పరిశ్రమలకు కొంతమంది నాయకులు, అధికారులు వత్తాసు పలుకుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కాలుష్యం నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. వారికి మద్దతుగా స్థానిక ఎంపీటీసీ జానా భాయ్, గడ్డపోతారం మాజీ సర్పంచ్ అశోక్, బిజెపి నేత లక్ష్మణరావు, నాయకులు శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో కాలుష్య సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించడంతోపాటు ఇక్కడ ఆసుపత్రిని నిర్మించి సిబ్బంది రైతులను ఏర్పాటు చేయాల న్నారు. ఈ ధర్నాతో కొద్దిసేపు రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెల్సుకున్న బొల్లారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ నిరసనలో ఎంపీటీసీ జానాబాయి, మాజీ సర్పంచ్ మద్దూర్ పటేల్ అశోక్, బిజెపి నేత మద్దూరు లక్ష్మణ రావు, నాయకులు శ్రీనివాస్, గడ్డపోతారం గ్రామస్తులు స్థానిక యువకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల సంబురాలు అదిరిపోవాలి

- పదేళ్ల ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేండ్లు పూర్తవుతున్న శుభ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో జూన్ 2 నుంచి 22వ వరకు నిర్వహించతలపెట్టిన దశాబ్ది ఉత్సవాల్లో ప్రతీ ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ పదేళ్ల ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాలపై నియోజకవర్గంలోని ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 10 ఏండ్ల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను పల్లె పల్లెనా ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని రంగురంగుల దీపాలతో అలంకరించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి గ్రామాన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు.



నాడు కాలుష్యానికి చిరునామాగా పిలిచే పటాన్ చెరు ను నేడు గేటెడ్ కమ్యూనిటీలకు, అంతర్జాతీయ సంస్థలకు కేంద్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య నుంచి.. ఉపాధి, పారిశ్రామిక రంగ అభివృద్ధి వరకు జరిగిన అభ్యున్నతిని ప్రజలకు వివరించాలన్నారు. 20 రోజులపాటు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తాను పాల్గొంటానన్నారు.అనంతరం వివిధ శాఖల అధికారులు దశాబ్ద కాలంలో సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-మునిపల్లి



గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలి మృతి చెందింది. ఈ ఘటన మునిపల్లి మండలంలోని కంకోలు టోల్ ప్లాజా వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. మునిపల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చారేటి కమలమ్మ అనే వృద్ధురాలిని కంకోలు టోల్ ప్లాజా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మొద ట గుర్తు తెలియని మహిళ శవంగా పోలీసులు భావించగా.. సమాచారం తెలుసుకున్న ఆనందం అనే వ్యక్తి సదాశివపేట ఆసుపత్రికి చేరుకుని తన తల్లిగా గుర్తించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సిద్ధార్థ జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ మండల పరిధిలోని కాన్సన్‌పల్లి వద్ద గల సిద్ధార్థ జిన్నింగ్ మిల్లులో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ తో పత్తికి మంటలు అంటుకోవడంతో కొంత భాగం కాలిపోయింది. జిన్నింగ్ మిల్ సిబ్బంది అప్రమత్తతతో మంటలను ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. జోగిపేట ఫైర్ స్టేషన్కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది సత్యనారాయణ, విటల్, తదితరులు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు మిల్లు యజమాని దిలీప్ తెలిపారు. ఫైర్ అధికారులు మాత్రం రూ.4 లక్షల అంచనా వేసినట్టు తెలిపారు.



సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ప్రజా ప్రతినిధులు



నవతెలంగాణ-నార్సింగి : తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జరపనున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ మూడవ తేదీన రైతు దినోత్సవం జరపాలని నిర్ణయించిన సందర్భంగా సభా ప్రాంగణాలను పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు పరిశీలించారు. నార్సింగి మండల కేంద్రంలోని రైతు వేదికను మంగళవారం సందర్శించారు. రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని నార్సింగి, శేరిపల్లి గ్రామ రైతు వేదికలను విద్యుత్ దీపాలతో, మామిడి తోరణాలతో అలంకరణ చేయాలని, వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం ఇంతవరకు అమలు చేసిన పథకాలను సభా సమయంలో ప్రదర్శించాలని, రైతు వేదిక క్లస్టర్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల రైతులు జూన్ మూడవ తేదీన జరగనున్న రైతు దినోత్సవంలో పాల్గొనాలని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు కోరారు. రైతు దినోత్సవం నాడు జరపబోయే వివిధ కార్యక్రమాల ఏర్పాట్లకు నార్సింగి రైతు వేదిక సభ ప్రాంగణమును జడ్పిటిసి కృష్ణారెడ్డి, సర్పంచ్ ఎర్రం అశోక్ గుప్తా, ఎంపీటీసీ సత్యనారాయణ, రైతు బంధు సమితి అధ్యక్షుడు లింగారెడ్డి, పి.ఎ.సి.ఎస్ చైర్మన్ శంకర్ గౌడ్, తహసీల్దార్ నారాయణ, మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

సన్నాహక సమావేశంలో ఎంపీపీ మంజుల



నవతెలంగాణ-కొల్చారం : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు కోరబోయిన మంజుల కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో దశాబ్ది ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశానుసారం జూన్ 2వ తేదీ నుంచి 20 రోజుల వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల సంతోష్, ఎంపీడీవో గణేష్ రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ రావు, వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఏపీవో మహిపాల్ రెడ్డి, ఎంపీ ఓ కృష్ణవేణి, ఐకేపీ ఏపిఎం సుశీల్వ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను రెగ్యులరైజర్ చేయాలి

సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం



నవతెలంగాణ-వెల్దుర్తి

గ్రామపంచాయతీలో పనిచేస్తున్న వందలాది మందిని వెంటనే రెగ్యులరైజర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం సూపరింటెంట్‌కు సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం మాట్లాడారు. స్వచ్ఛ తెలంగాణలో అగర్ గాంధిగా నిలిచిన సఫై కార్మికులకు సెల్యూట్ కొడితే సరిపోదని జీవో నెంబర్ 60లో పేర్కొన్న విధంగా వెంటనే రూ.19 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా వేయి రూపాయలు పెంచుతూ సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన సరిపోదన్నారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది మొత్తాన్ని పర్మినెంట్ చేయాలని పిఆర్సిలో నిర్ణయించిన మినిమం బేసిక్‌ను వేతనంగా చెల్లించాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌ను కేటాయించాలన్నారు. ప్రతి నెల రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51ని సవరించాలని మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని వివిధ కేటగిరిలన్నింటిని కొనసాగించాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టంలకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. పంచాయతీ అసిస్టెంట్లుగా నామకరణం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గపతి, యాదయ్య శ్రీను, పోచయ్య, ఎల్లం చేతులు, సత్తయ్య, రాజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టరు కింద పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



ప్రమాదవశాత్తు ట్రాక్టరు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన హవేలి ఘనపూర్ మండలంలోని మండల పరిధిలో రాజపేట తాండ గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. హవేలీ ఘనపూర్ ఏఎస్ఐ రాజు తెలిపిన రాజపేట తాండ గ్రామానికి చెందిన లంబాడి సర్వన్ (38) మృతి చెందాడు.మృతుడు సర్వన్ కొత్తపల్లి గ్రామం నుంచి రాజుపేట తండాకు వస్తుండగా దారిలో ట్రాక్టర్ అదుపుతప్పడంతో ప్రమాదవశాత్తు టాట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతుని భార్య బూలి కన్నీరు మున్నీరయ్యారు.భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ఆటో నడుపుకుంటూ జీవిస్తున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని కాళ్ళకల్లో జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ మండలం పేరూర్ గ్రామానికి చెందిన వాడి వెంకటొరెడ్డి (55) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసముంటున్నట్లు తెలిపారు. కాగా మంగళవారం సాయంత్రం నాలుగున్న గంటల ప్రాంతంలో గ్రామంలోని కొత్త వైన్ సమీపంలో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి సంబందించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ సందీప్‌రెడ్డి పేర్కొన్నారు.

కల్వకుంటలో పౌరహక్కుల దినోత్సవం


నవతెలంగాణ-నిజాంపేట



మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. ఆర్ఐ గంగాధర్ గౌడ్ గ్రామ కార్యదర్శి కవితలు మాట్లాడుతూ గ్రామంలో ఎవరినైనా అంటరాని వారని, రెండు గ్లాసుల పద్ధతి కాని అన్నట్లయితే వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయబడతాయన్నారు. షెడ్యూల్ కులాలు షెడ్యూల్ తెగల వారికి ఎలాంటి అన్యాయం జరిగిన నిజాంపేట తాహసిల్దార్‌కుగాని, పోలీసులకుగాని ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు


రగ్బీ పోటీల సెలక్షన్ కమిటీ చైర్మెన్‌గా గణేష్ రవికుమార్

నవతెలంగాణ-చేగుంట



మే 31 నుంచి జూన్ ఒకటో తేదీన సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌గనగర్‌లో జరిగే ఐదవ జూనియర్ బాల, బాలికల రగ్బీ పోటీలకు రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ చైర్మెన్‌గా మెదక్ జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు కర్ణం గణేష్ రవికుమార్‌ను ఎన్నుకున్నారు. చేగుంట పట్టణానికి చెందిన గణేష్ రవికుమార్ స్పోర్ట్స్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి తెలంగాణ రగ్బీ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈసారి కూడా సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా గణేష్ రవికుమార్ నియమించినట్లు తెలంగాణ రగ్బీ అసోసియేషన్ తెలిపింది. ఈ సందర్భంగా గణేష్ రవికుమార్ మాట్లాడుతూ అట్టడుగున ఉన్న తెలంగాణ జట్టును మంచి సెలక్షన్ జట్టును పంపి 7, 8వ స్థానానికి తీసుకు రాగలిగినట్లు అలాగే మంచి టీం సెలెక్ట్ చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపి మంచి ఫలితాలు రాబట్టడానికి ప్రయత్నం చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

దళిత గిరిజన ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నార్సింగి : నార్సింగి మండల కేంద్రంలో జెడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన దళిత గిరిజన సర్పంచులు నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి కృష్ణారెడ్డి, దుబ్బాక దళిత బంధు అధ్యక్షుడు కరికె శ్రీను మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం దళిత గిరిజన ఆత్మీయ సమ్మేళనం జూన్ 4న అక్బర్పేట్ భూంపల్లి మండలంలో నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి హరీష్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని తెలిపారు. నార్సింగి మండలం నుంచి దళిత గిరిజన సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి దళితులకు అనేక పథకాల ద్వారా బడుగు బలహీన వర్గాల వారికి అండగా నిలుస్తున్నారన్నారు. గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చి నూతన పంచాయతీ భవనాల నిర్మాణం, సిసి రోడ్లు, త్రాగునీరు వంటి అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నారన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఏమైనా సమస్యలు ఉంటే నాయకులకు వివరించి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల బీ.ఆర్.ఏస్ పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, వైస్ ఎం.పీ.పీ సుజాతా శంకర్, వల్లూరు గ్రామ సర్పంచ్ మహేశ్వరి, ఎంపిటిసి సత్యనారాయణ, పార్టీ ఇన్చార్జ్ కందరి నవీన్, ప్రభాకర్, జోగు జీవన్, భాషా నాయక్, ఎరుకల మైసయ్య, ఎరుకల పోచయ్య, నర్సింలు పాల్గొన్నారు.

రోడ్లపైనే ధాన్యం, ఆందోళనలో రైతన్నలు

- వర్షం ఎప్పుడు వస్తుందో అనే ఆందోళన
- లారీలు లేక కల్లాలోనే ధాన్యం



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దక్కించుకుని అమ్ముకోవడానికి రైతన్నలు నానా యాతనలు పడుతున్నారు. నెలల తరబడి రాత్రనక పగలనక పంటలు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే ధాన్యంను తరలించేందుకు కనీసం లారీలు కూడా అందుబాటులో లేక కల్లాలోనే ఉన్న దాన్యాన్ని ఎలా కాపాడుకోవాలని ఆవేదనకు గురౌతున్నారు. తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో ఐకేపి, పీఏసీఎస్‌ల ద్వార కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాంతో రైతులు కోతలు కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. రెండు మండలాల్లో గత నెల రోజుల నుంచి రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించినా ఇప్పటి వరకు రెండు మూడు లారీల లోడ్‌లను మాత్రమే మిల్లులకు తరలించారు. దాంతో కొనుగోలు కేంద్రాల వద్ద కల్లాలోనే పెద్ద ఎత్తున ధాన్యం నిలువ ఉండిపోయింది. అటు అధికారులు తహశీల్దార్‌లు, ఆర్డీఏ అధికారులు కూడా రోడ్లపైకి వచ్చి లారీలను తరలించే ప్రయత్నాలను చేస్తున్నారు. అయినప్పటికి లారీల యజమానులు ముందుకు రాకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం ఉండపోతుంది. అటు ధాన్యాన్ని తరలించిన లారీలు మిల్లర్ల వద్ద రోజుల తరబడి నిలిచి ఉండడంతో పాటు లారీల డ్రైవర్లకు సిబ్బందికి కనీసం అన్నం కూడా పెట్టడం లేదని కొందరు లారీల సిబ్బంది ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు. దాంతో ధాన్యాన్ని తీసుకెళ్లడానికి లారీల యజమానులు ముందుకురావడంలేదు. దాంతో రైతుల దాన్యం కల్లాల్లోనే ఉండిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు వర్ష సూచనలు ఉండడంతో పూర్తిగా ఎండిన దాన్యం తిరిగి వర్షం పడితే తడిసి మొలకెత్తే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంట వెంటనే లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

కార్మిక హక్కుల సాధనకు సీఐటీయూ నిరంతరం పోరాటం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు



నవ తెలంగాణ-మెదక్ టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు రద్దు చేయడానికై కార్మికులు చేపట్టే పోరాటాలకు వెన్నంటి ఉండే జెండా సీఐటీయూ అని జిల్లా కార్యదర్శి బసవరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మెదక్ పట్టణంలో రైల్వే స్టేషన్ వద్ద ఆటో యూనియన్ అధ్వర్యంలో సీఐటీయూ జెండావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐటీయూ అంటేనే నిరంతరం కార్మికుల హక్కుల కోసం శ్రమను దోచుకునే దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేసే జెండా అని అన్నారు. 135 సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా కార్మికుల హక్కుల కోసం శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ఎనిమిది గంటల పని దినాల కోసం వీరోచితమైన పోరాటాలు చేసి ప్రాణ త్యాగాలు చేసి హక్కులను సాధించుకున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం 9 సంవత్సరాల కాలంలో సరళీకృత ఆర్థిక విధానాలు ముందుకు తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తిరగదోడి అదాని అంబానీ పెట్టుబడదారులకు లాభాల కోసం కార్మికుల పొట్టలు కొట్టే విధంగా మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేసిందన్నారు. బీజేపీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తీసుకువచ్చి కార్మికులకు మతం రంగు పులిమి హక్కుల మీద పోరాటం చేయకుండా బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. సమ్మెలు చేయకుండా సంఘాలు పెట్టుకోకుండా కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి కార్మిక ఐక్యతను పక్కదారి పట్టించే విధంగా బీజేపీ ఆర్ఎస్ఎస్ తీవ్రంగా ప్రయత్నం చేస్తుందన్నారు. మతాన్ని రాజకీయ స్వార్థం కోసం దుర్వినియోగం చేస్తూ కార్మిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మతోన్మాద విదానాలను ఎండగడుతూ సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల వల్ల పారిశ్రామిక రంగం సంక్షేమంలో కూరుకపోయిందన్నారు. అభివృద్ధి కుంటుపడి కార్మికుల శ్రమ దోపిడీ బాగా పెరిగిందన్నారు. అందుకోసమే బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా హక్కులను కాపాడడం కోసం కార్మికులందరు ఐక్యంగా వుండి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్ , పరిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తాలో సీఐటీయూ జెండావిష్కరణ

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం



నవతెలంగాణ-వెల్దుర్తి : మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ మల్లేశం హమాలి కార్మికులతో కలిసి సీఐటీయూ జెండావిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఐటీయూ 1970లో ఏర్పాటై ఆనాటి నుంచి ఈనాటి వరకు కార్మికుల ఐక్యత కోసం అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. కార్మికుల ఐక్యత కోసం ఎన్నో పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ పోరాటాలు చేస్తూ కార్మికుల పక్షాన నిలబడిందన్నారు. అన్ని కార్మిక వర్గాలను ఏకం చేసి వారి పక్షాన ఉండి పోరాటాలు చేసిన ఘనత సీఐటీయూ దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గాని ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో గాని అంగన్వాడి ఆశ గ్రామపంచాయతీ , హమాలీ కార్మిక సంఘాలకు అండగా ఉండి ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ఉందన్నారు. నేటి పాలకులు కార్మికులను విస్మరించి కార్పోరేట్ వ్యక్తులకు ఊడిగం చేస్తున్నారన్నారు. దోపిడి పాలన అంతం కావాలని పోరాటం చేస్తుందన్నారు. దోపిడి పాలన అంతం కావాలని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పోచయ్య భూషణ్, అంజయ్య గోపాల్ బాలయ్య రమేష్ పాల్గొన్నారు.

లారీలు వస్తలేవు వడ్లు పోతలేవు

దశాబ్ది ఉత్సవాల సమావేశంలో ప్రజాప్రతినిదుల ఆగ్రహం

నవతెలంగాణ-చిలిపిచెడ్



కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నెల రోజులు అవుతున్నా కొనుగోలు కేంద్రాలకు లారీలు వస్తలేవు, వడ్లు పోతలేవని, పోయాకే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. మండలంలోని చిలపిచెడ్ రైతు వేదికలో మంగళవారం అధికారులు ప్రజాప్రతినిధులతో కలిపి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు వడ్లు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజుల అవుతున్న కొనుగోలు కేంద్రాలకు లారీలు వస్తలేవు వడ్లు పోతలేవని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లు ప్రారంభించి 25 రోజులైందని, సంచికి రూ.6 నుంచి 8లు ఇస్తేనే ఖాళీ చేస్తున్నారని, లేకుంటే ఖాళీ చేయటం లేదన్నారు. ఒక్కొక్క రైస్ మిల్లు లారీలు చాలా ఉన్నాయి మెదక్ జిల్లా అంటే ఇంత వేల్యూ లేదు అని ప్రజాప్రతినిధులు సభాముఖంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ముసాదిక్ స్పందిస్తూ చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వినోద, ఎంపిడిఓ శశిప్రభ, ఏవో బాల్ రెడ్డి, ఏఈఓలు భూపాల్, రమ్య, విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు, ఎస్సై మహ్మద్ గౌస్, ఏపీవో శ్యామ్, ఏపిఎం ప్రేమలత, సర్పంచులు కవిత ముకుందారెడ్డి, పరశురాం రెడ్డి, ఇస్తారి, మనోహర నరసింహారెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మనోహరాబాద్ ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



జూన్ 2 నుంచి నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా పండగ వాతావరణంలో ఘనంగా చేపట్టాలని మనోహరాబాద్ ఎంపీపీ పురం నవనీత రవిముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో యాదగిరిరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి జూన్ 2 నాటికి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిర్వహించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు ఎంపీటీసీలు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ పథకాలను, మహిళా అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. 2న పతాకావిష్కరణతో ప్రారంభమవుతుందని తెలిపారు ప్రతి సర్పంచ్, ఎంపీటీసిలు దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దశాబ్ది ఉత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహించాలని ఎంపీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తి, తహశీల్దార్ భిక్షపతి, వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఎంపీవో లక్ష్మీనర్సింలు, మండల కోఆప్షన్ మున్వర్, నాయకులు పురం రవిముదిరాజ్, రాష్ట్ర నాయకులు బాషబోయిన ముదిరాజ్‌లతో పాటు అధికారులు పాల్గొన్నారు.

అక్షర ప్లానెట్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

అనుమతులు లేకుండా ఉన్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి
ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న అక్షర ప్లానెట్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్షర ప్లానెట్ స్కూల్ యాజమాన్యం ఎక్కువగా ప్రచారం చేస్తూ అమాయకులైన విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేయాలని చూస్తున్నట్టు తెలిపారు. అలాంటి అక్షర ప్లానెట్ స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని కూడా ఉల్లంఘిస్తూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నడుపుతున్నట్టు తెలిపారు. మండల కేంద్రంలోనే ఏర్పాటు చేసినప్పటికి అటు జిల్లా విద్యాశాఖ అధికారులు కానీ, మండల విద్యాఅధికారులు కానీ చూసీ చూడనట్టు వ్యవహరిసున్నారని ఆరోపించారు. విద్యార్థులలో తప్పుడు ప్రచారం చేస్తూ లాబాలే లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు స్కూళ్ళపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అక్షర ప్లానెట్ స్కూల్‌ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలను నడిపేందుకు ఆరు నెలల ముందే అనుమతి తీసుకునేందుకు విద్యా హక్కు చట్టం అవకాశం కల్పింస్తుందన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పర్మిషన్ లేకుండానే విద్యార్థులను అడ్మిషన్ చేసుకున్నారన్నారు. అయినప్పటికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న అక్షర ప్లానెట్ స్కూల్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు ప్రవీణ్ డిమాండ్ చేశారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి

విజేతలకు బహుమతులను అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-హవేలి ఘనపూర్



క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహానికి గురికాకుండా విజయం సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. హవేళిఘనాపూర్ మండలం సుల్తాన్ పూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ రేణుక రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా శారీరక ధృఢత్వంతో పాటు, మానసికోల్లాసం వృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని కోరారు. గెలవలేనన్న ఆశ లేనివాడు ఆటకు ముందే ఒడిపోతాడని, ప్రతి క్రీడాకారుడు పట్టుదలతో ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎంపీటీసీల పోరం అధ్యక్షులు మాణిక్ రెడ్డి, సుల్తాన్ పూర్ గ్రామ సర్పంచ్ లు రేణుక రమేష్, మంద శ్రీహరి, నాయకులు మ్యాకల. సాయిలు, రామచంద్ర రెడ్డి, నరేందర్ రెడ్డి, సంతోష్, పురం.శంకర్, చందర్, సుభాష్ కిష్టయ్య, నరసయ్య, పోచయ్య వెంకట్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశానికి ఆసక్తి చూపని ప్రజాప్రతినిధులు

దుమ్మా కొట్టిన సర్పంచ్‌లు, ఎంపీటీసిలు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ కార్యక్రమాలపై చేపట్టిన సన్నాహక సమావేశాలకు మండలంలోని ప్రజాప్రతినిధులు దుమ్మా కొట్టారు. రాష్ట్ర అవతరణ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వం చేపట్టే 21 రోజుల కార్యక్రమాలను ప్రజాప్రతినిధులకు తెలిపేందుకు సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేశారు. అయినప్పటికి సన్నాహక సమావేశానికి మండలంలోని 17 మంది సర్పంచ్‌లలో కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంపీటీసిలు మాత్రం ఒక్కరు కూడా హాజరుకాలేదు. అంటే దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై వారికి అవగాహన అక్కరలేదా లేక ఆసక్తి లేదా అనే అనుమానం వ్యక్తమవుతంది. మరో వైపు గ్రామాల్లో రైతులు ధాన్యం రోడ్లపై పోసుకుని ఆందోళనలు చేపడుతున్న తరుణంలో దశాబ్ది ఉత్సవాలలో వారిని పాల్గొనాలని అడిగేందుకు సర్పంచ్‌లు కానీ ప్రజాప్రతినిధులు కానీ ముందుకు వచ్చే ప్రయత్నాలు చేయలేని పరిస్థితి నెలకొందని కొందరు సర్పంచ్‌లు తెలిపారు. సన్నాహక సమావేశానికి కేవలం కార్యదర్శులు, వివిధ శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశానికి కాళ్ళకల్ సర్పంచ్ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తిమల్లేష్‌ముదిరాజ్, రంగాయిపల్లి సర్పంచ్ నాగభూషణం, చెట్లగౌరారం సర్పంచ్ నర్సయ్య, అగ్రహారం సర్పంచ్ రేణుక తదితరులు హాజరయ్యారు.

నూతన తహసిల్దార్, ఆర్ఐలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రానికి నూతనంగా బదిలీపై వచ్చిన తహసిల్దార్ ప్రభాకర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంగాధర్ గౌడ్‌లను నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా శాలువాగప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కన్నగారి లింగం గౌడ్, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, సేవాదళ్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి రాజయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రమావత్ వినోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజిరెడ్డి , భూమా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాలకు బస్సు వచ్చిందోయ్



నవతెలంగాణ-వెల్దుర్తి : మాసాయిపేట మండలం అచ్చంపేట గోపాలకృష్ణ పురం హక్కింపేట అచ్చంపేట గ్రామాల నుంచి తూప్రాన్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే మదన్ రెడ్డికి ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డితో కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం మెదక్ నుంచి ఉప్పులింగాపూర్ మీదుగా దరిపల్లి హకీంపేట అచ్చంపేట గోపాలకృష్ణ పురం మాసయ్యపేట మీదుగా బస్సు ప్రారంభించడం జరిగిందని మెదక్ డిపో మేనేజర్ తెలిపారు. ఉదయం సాయంత్రం ఇదే రూట్లో వెళ్తుందన్నారు బస్సు సౌకర్యం ఏర్పాటు పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



గజ్వేల్ రింగ్ రోడ్‌పై సూచిక బోర్డుల ఏర్పాటు





నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో రూ.230 కోట్లతో నిర్మించిన రింగురోడ్డుపై సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 23 కిలోమీటర్ల రింగ్ రోడ్డు దాదాపు పూర్తికాగా సూచిక బోర్డులు లేకపోవడంతో కొంత ప్రయాణికులకు అయోమయంగా ఉండడం వల్ల రోడ్డు భవనాల శాఖ అధికారులు సూచిక బోర్డులను కిలోమీటర్ల వారిగా ఏర్పాటు చేశారు. గజ్వేల్ సిద్దిపేట మార్గంలో ఉన్న రింగురోడ్డు పలుచోట్ల సూచిక బోర్డులు ఏర్పాటుకు బిగించేందుకు రోడ్డు భవనాలు శాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. కొన్ని బోర్డులను బిగించేశారు. గజ్వేల్ నుండి సిద్దిపేటకు వెళ్లే ప్రధాన హాదారి పై సూచిక బోర్డు భారీ పొడుగున ఏర్పాటు చేశారు. ఈ బోర్డు పలువురిని ఆకర్షిస్తుంది.

ఉప్పర్‌పల్లిలో మహిళా భవనం పూర్తయ్యేనా?



- 10 ఏళ్లుగా గోడలకే పరిమితమైన పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-దౌల్తాబాద్

అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఫలితంగా దౌల్తాబాద్ మండలంలోని ఉప్పర్పల్లి గ్రామంలో మహిళా భవనం పూర్తికావడం లేదు. ఈ గ్రామంలో 10 ఏళ్ల క్రితం రూ.10 లక్షలతో మహిళా భవనం నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. మొదట్లో పనులు ముమ్మరంగా జరిగాయి. ప్రస్తుతం ఫిల్లర్ల స్థాయి నుంచి శ్లాబ్ లెవల్ పనులను పూర్తి చేశారు. అప్పటినుంచి నేటివరకు మహిళా భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. తొందరగా పూర్తిచేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు గ్రామస్థులు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. మహిళా సంఘానికి పక్కా భవనం లేకపోవడంతో గ్రామ మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికా రులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అకాల వర్షానికి అన్నదాతలు ఆగమాగం

నవతెలంగాణ-తొగుట

మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం అకాల వర్షం కురవడంతో రైతులు ఆగమాగమయ్యారు. మండలంలోని లింగాపూర్, వెంకట్రావుపేట, రాంపూర్, తుక్కాపూర్, గణపూర్ తదితరులు గ్రామాలలో వర్షం కురవడంతో ఐకెపి కొనుగోలు కేంద్రాలలో అరబెట్టిన వరి ధాన్యం తడి సి ముద్ద అయింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా ధాన్యం తరలించేందుకు లారీల కొరత ఏర్పడడంతో రైతులు పడిగాపులు కాస్తున్నా రు. ధాన్యం తూకం వేసినా లారీలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసిపోయింది. ఆరబెట్టిన ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గంట సేపు భారీ వర్షం పడింది. దీంతో వర్షం ధాటికి నిల్వ ఉంచిన ధాన్యం కొట్టుకుపోయింది. గాలీ దుమారంతో



కూడిన వానతో తెంపేందుకు సిద్ధంగా ఉన్న మామిడికాయలు నేలరాలాయి. గాలికి చెట్లు విరిగాయి. కూరగాయల పంటలకు కూడా నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. మంగళవారం నంగునూరు మండలంలోని కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, రాష్ట్ర ఆయిల్ ఫామ్ సొసైటి ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి తదితరులు సందర్శించారు. వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ విషయంపై రెవిన్యూ, వ్యవసాయ అధికారులను వివరణ కోరగా బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చూసి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిధిలోని మునిగడప గ్రామంలో మంగళవారం నాడు రైతులు రోడ్డు బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి గన్ని భ్యాగులు లేక హమాలీల ఇబ్బంది వల్ల ధాన్యం కొనుగోలు చేయక కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు ఆగ్రహంతో రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం ఆనంద్‌పై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక ఎస్సై కృష్ణమూర్తి కలుగ జేసుకొని రైతులకు వీలైనంత త్వరగా కొనుగోలు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



నవతెలంగాణ-నంగునూరు

వీవోఏల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు చల్ల కిష్టారెడ్డి ఆరోపించారు. నంగునూరు మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న సమ్మె కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు వీవోఏలతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు ఇవ్వడంలో విఫలమయ్యారని ఆరోపించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమ్మెలో నాయకులు అయోధ్య, జహీర్,పులి రాజు, పర్శరాములు, శ్రీశైలం, రమ, సుజాత, మౌనిక, రేణుక, స్వరూప,దేవిక, పద్మ లత, అనురాధ, వెంకట్ లక్ష్మీ, భాగ్యలక్ష్మి, విజయ, వాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



నవతెలంగాణ-నంగునూరు

రైతు విక్రయ కేంద్రాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజగోపాల్ పేట ఎస్ఐ రాజుగౌడ్, మండల వ్యవసాయ అధికారి గీత హెచ్చరించారు. మంగళవారం నంగునూరు మండలంలో పాలమాకుల, రాంపూర్, సిద్ధన్నపేట, నంగునూరులలో గల సీడ్స్ షాపులను తనిఖీ చేశారు. విక్రయ కేంద్రంలోనున్న రిజిస్టర్లను పరిశీలించారు. అమ్మిన ప్రతిదానికి బిల్లు చెల్లించాలని కోరారు. కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

నత్త నడకన సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు



నవతెలంగాణ-వర్గల్

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరగడం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారాని వర్గల్ మండల బీజేపీ అధ్యక్షులు శ్రీరాం శ్రీకాత్ అన్నారు. మంగళవారం రోజున మండలంలోని నెంటూర్ గ్రామంలోని ఐకేపీ సెంటర్ ను బీజేపీ కార్యకర్తలతో సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 రోజులుగా కొనుగోళ్ళల్లో ఆలస్యం జరుగుతుందని, ధాన్యం తరలింపుకై ఎవ్వరి వాహనాలు వారే తెచ్చుకోవాలని అంటున్నట్లు రైతులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ధాన్యం కొనుగోళ్ళ చేయడం లేదని అన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి జిల్లా అధికారికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ పరిశీలనలో ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, కిసాన్ మోర్చ అధ్యక్షులు కాయిత రాజు, , బీజేవైఎం అధ్యక్షులురవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కిచ్చుగారి పాండు, బూత్ అధ్యక్షులు ప్రదీప్ గౌడ్, ఎర్రవల్లి మధు మరియు సాయి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లపై దాడిని ఖండిస్తూ క్యాండిల్స్‌తో ఎస్ఎఫ్ఐ నిరసన



నవతెలంగాణ -సిద్దిపేట

భారత రెజ్లర్లపై జరిగిన దాడిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్యాండిల్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు కొండం సంజీవ్ కుమార్ మాట్లాడుతూ వాళ్ళ చెమటనును ధార పోసి, మన దేశానికి బంగారు పతకాలు తీసుకొచ్చిన రెజ్లర్ల పైన లైంగిక, వేధింపులకు గురిచేసిన ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేయాలన్నారు. ఢిల్లీలో రాజ్యాంగం కల్పించిన హక్కుతో ధర్నాలు చేస్తుంటే, రెజ్లర్లని కుక్కలను ఇడ్చుకుపోయినట్టు తీసుకపోవడం బాధాకరమన్నారు. వేధింపులకు గురి చేసిన వారిని వెంటబెట్టుకొని పార్లమెంట్ మొత్తం తిరుగుతున్నారని, కనీసం కేసు కూడా నమోదు చేయలేదని బాధపడ్డారు. వెంటనే ఎంపీపై కేసు నమోదు చేసి, చట్టారీత్యా శిక్షలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చెప్యాల సంతోష్ కుమార్, పట్టణ కార్యదర్శి పెరిక చక్రి, పట్టణ ఉపాధ్యక్షుడు అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను ఎదురించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలను కార్మిక వర్గం ఐక్యతతో ఎదిరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తునికి మహేష్ అన్నారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత విభజన సమీకరణ వెనకాల ఆర్ఎస్ఎస్ కీలకపాత్ర పోషిస్తుందని విమర్శించారు. దేశంలో కార్పొరేట్ శక్తుల లాభాలకు ఎదురులేకుండా చేయాలని కార్మిక ఐక్యతను బిజెపి దెబ్బతీయాలని చూస్తోందని అన్నారు. భారతదేశ ఆర్థికంగా నిలబడడానికి వెన్నుముకగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అతి తక్కువ రేట్లకే అప్పనంగా కేంద్ర ప్రభుత్వం అమ్ముతోందన్నారు. విద్యార్థుల మనసులో విష బీజాలు నాటే విధంగా పాఠ్యపుస్తకాల్లో కాషాయీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బిజెపి చేసే కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు ప్రజలు, కార్మిక, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల సీనియర్ నాయకులు మహంకాళి నర్సింలు, యద రాయమల్లు,హమాలి కార్మికులు,గ్రామ పంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడేది సీఐటీయూ ఒక్కటేనని సీఐటీయూ దూల్మిట్ట మండలం నాయకులు సిద్దులు అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండాను



ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ 1970లో ఏర్పడిన నాటినుండి కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించి అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. రాబోయే కాలంలో కార్మికుల



పక్షపాతిగా ఉంటూ వారి సమస్యలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, ప్రసాద్, నరసింహులు, కనకయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవం



నవతెలంగాణ- సిద్దిపేట

వాసవి క్లబ్స్, యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శారదా నికేతన్ హై స్కూల్ లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరాన్ని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్దిపేట వాసవి క్లబ్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. వాసవి క్లబ్స్ లో కేవలం ఆర్యవైశ్యులే సభ్యత్వం ఉండి కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ యొక్క వైద్య శిబిరంలో 300మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో గుండెకు సంబంధించిన డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, నరాలు డాక్టర్ చంద్రకాంత్, ఎముకల డాక్టర్ ప్రజీత్ కుమార్, క్యాన్సర్ డాక్టర్ చంద్రశేఖర్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ అభితేజ్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ అభిరామ్‌లు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడం, పరీక్షలు నిర్వహించారు. వాసవి క్లబ్ వారు డాక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొత్తపల్లి రాధా- వేణుగోపాల్, నాయకులు అడ్డగట్ల శేఖర్, అంజి, యశోద హాస్పిటల్స్ ప్రతినిధులు నరేందర్ మోర, రాజిరెడ్డి, వాసవి క్లబ్స్ అధ్యక్షులు చింత రాజేంద్ర ప్రసాద్, తొడుపునూరి కృష్ణవేణి, అర్వపల్లి హరికిరణ్, వాసవి క్లబ్ నాయకులు గంప కృష్ణమూర్తి, పుల్లూరి శివకుమార్, సోమవనజ, సోమ శివకుమార్, మాంకాళ శ్రీనివాస్, కొండూరు మహేష్, నేతి వేణు కుమార్, చకిలం రవి, బూరుగు వేణుగోపాల్, మర్యాల వీరేశం, కొమురవెల్లి కల్పన, తిమ్మిశెట్టి విజయలక్ష్మి, చింత సరోజ, అయిత మంజుల, ఉప్పల రమేష్, మాచర్ల సత్యనారాయణ, దొంతుల రాజ శ్రీనివాస్, మాంకాళ సంతోష్, గందె శ్రీనివాస్, కోర్తివాడ లక్ష్మణ్, సంతోష్, నాగరాజు, నాగేందర్, బుక్క శివ పాల్గొన్నారు.

అధ్యక్ష పీఠంపై తర్జన భర్జన



- ఈసారైనా దళితులకు పదవి దక్కేనా ?
- పదవి కోసం ఎవరికి వారే ప్రయత్నాలు
- కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి రేసులో పలువురు నాయకులు

నవతెలంగాణ-దౌల్తాబాద్

మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందో అని మండల వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. మండలంలో పలువురు నాయకులు ఇప్పటికే పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మండల అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారిలో మండలానికి చెందిన నలుగురు తీవ్రంగా పోటీ పడుతున్నట్లు సమాచారం. పోటీ పడుతున్న వారిలో ప్రస్తుత మండల అధ్యక్షుడు దశరథ రెడ్డి, గొడుగుపల్లి మాజీ ఎంపీటీసీ మద్దెల స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలూ, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పడాల రాములు ఉన్నారని సమాచారం. దశరథ రెడ్డి ప్రస్తుతం మండల అధ్యక్షుడిగా ఉన్నందున ఈసారి అధ్యక్ష పదవి కొత్త వ్యక్తులకు ఇవ్వాలని మండలంలోని పార్టీ కార్యకర్తలు నాయకులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పై ఒత్తిడి పెంచుతున్నారు. పడాల రాములు గతంలో జెడ్పీటీసీ పార్టీ బీ ఫాం పై పోటీ చేశారు. మండలంలో సీనియర్ నాయకునిగా మంచి పేరుంది. బండారు లాలు ప్రస్తుత ఎస్సీ సెల్ మండల అధ్యక్షునిగా ఉన్నారు. ఎలాగైన మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. గతంలో మాజీ మంత్రి ముత్యంరెడ్డి అనుచరునిగా పేరుంది. గొడుగుపల్లి మాజీ ఎంపీటీసీ మద్దెల స్వామి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి సన్నిహితుడిగా ముద్ర ఉంది. పార్టీలో ప్రతీ ఒక్కరికీ సన్నిహితంగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారనే పేరు ఉంది. ఇప్పటి వరకు మండల అధ్యక్షులుగా ఎస్సీ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వనందున ఈ సారి అవకాశం ఎస్సీ సామాజిక వర్గానికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు. మొత్తంగా మండల అధ్యక్ష పదవి మండల కాంగ్రెస్ నాయకుల్లో అంతర్గత కుమ్ములాట మొదలైంది. ఒకరికి పదవి ఇస్తే ఇంకొకరు సహకరించమని బాహాటంగానే చెబుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం ఏ విధంగా చూపిస్తారని అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. పోటీలో ఉన్న నలుగురు చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి సన్నిహితంగా ఉండటం వల్ల అధ్యక్ష పదవి ఎవరికి ఇస్తారు? ఎవరికి నచ్చచెపుతారని చర్చ జోరుగా సాగుతుంది. అలాగే పోటీలో ఉన్న నలుగురిలో యువ నాయకులకు అవకాశం ఇవ్వాలని మండల యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ కార్యకర్తలు నాయకులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా గత కొద్ది రోజుల్లో అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందో తేలనుంది.

పంటనష్టం డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు

- తక్షణమే ఆర్థిక సహాయం అందించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

గత నెలలో కురిసిన అకాల వర్షం రైతన్నను నిలువునా ముంచింది. చేతికి వచ్చిన పంట నేలరాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మార్చి, ఏప్రిల్ నెలలో కురిసిన అకాల వర్షాల మూలంగా జిల్లా వ్యాప్తంగా రైతులు పంట నష్టపోయారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎకరాకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సహకారం అందిస్తానని ప్రకటించారు. వేసవి పంట నష్టపోయిన రైతులు వర్షాకాలం పంటలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం వస్తే తమకు ఆ డబ్బులు పెట్టుబడులకు ఉపయోగపడతాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారాన్ని అందిస్తే తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

51,261 ఎకరాలలో పంట నష్టం

జిల్లాలో ఈ యాసంగిలో 3,46,797 ఎకరాలలో వరి సాగు, 16,883 ఎకరాలలో మొక్కజొన్న పంట, 7, 228 ఎకరాలలో పొద్దుతిరుగుడు, 5,800 ఎకరాలలో ఇతర పంటలు వేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 15



వేల ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. గతంలో కురిసిన వడగళ్ల వర్షాలు అకాల వర్షాలు మూలంగా జిల్లా వ్యాప్తంగా 65,056 మంది రైతులకు సంబంధించిన 51,261 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. 44601 ఎకరాల వరి, 475 ఎకరాల మొక్కజొన్న, ఒక ఎకరం నువ్వుల పంట, 25 ఎకరాల పొద్దు తిరుగుడు పంట, 6158 ఎకరాల ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం వెంటనే తమ అకౌంట్లో పంట నష్టపరిహారాన్ని వేస్తే వాటితో వర్షాకాలం పంటల కోసం ఎరువులు విత్తనాలు దున్నకానికి ఉపయోగపడతాయని రైతులు కోరుతున్నారు.

పంటల పరిశీలనలు

అకాల వర్షంతో నష్టపోయిన పంటలను గతంలోనే ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు గ్రామాలలో పర్యటించి పరిశీలించారు. గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పంట నష్టం జరిగిన ప్రతి ఎకరాన్ని పరిశీలించి నష్టపోయిన వివరాలను సేకరించారు. అధికారులు సేకరించిన వివరాలతో వెంటనే నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించాలని ప్రతిపక్ష పార్టీలు, నష్టపోయిన రైతులు కోరుతున్నారు.



సీఎస్‌సీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-దుబ్బాక

సీఎస్‌సీ హెల్త్ కేర్, సీఐటీయూ, భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపులో భాగంగా మంగళవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్లకు వెళ్తే అనవసరమైన పరీక్షలు నిర్వహించి కార్మికుల వద్ద నుంచి విచ్చలవిడిగా డబ్బులు లాగుతూ మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్మికుల మేలుకొరకే ఈ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే మండల పరిధిలోని భవన నిర్మాణ కార్మికులకు 132 రకాల ఆరోగ్య పరీక్షల్ని నిర్వహించడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో మండలంలోని గ్రామాల్లో ఈ హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేసి భవన నిర్మాణ కార్మికులందరికీ ఉచిత పరీక్షలు నిర్వహిస్తామని సీఎస్‌సీ హెల్త్ కేర్ సెంటర్ కో-ఆర్డినేటర్ నవీన్ చెప్పారు. క్యాంపు ఏర్పాటుకు సహకరించిన మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి,మున్సిపల్ సిబ్బందికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్యాంపులో సిఎస్ సి హెల్త్ క్యాంపు జిల్లా కో-ఆర్డినేటర్ బాబు,సెంటర్ కో-ఆర్డినేటర్ నవీన్, డా.పూజిత,సిఐటియు దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపెల్లి భాస్కర్ పలువురున్నారు.

అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో



నవతెలంగాణ-చేర్యాల

అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని, నిత్యవసర వస్తువుల పౌరసరఫరా వ్యవస్థను పటిష్ట పరచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఎస్.కె. ఆరిఫాకు మెమోరాండం అందజేశారు. అనంతరం కొంగరి వెంకటమావో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో పేదలు కొత్త రేషన్ కార్డుల కోసం గతంలో దరఖాస్తు చేసుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎదురు చూస్తున్నారని తెలిపారు. పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసి సరుకులను, బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత క్రమక్రమంగా పౌర సరఫరా వ్యవస్థను దిగజార్చారని, గతంలో కొన్ని రకాల సరుకులు సబ్సిడీ ధరలకు పంపిణీ చేసేవారని ప్రస్తుతం కేవలం బియ్యంతో సరిపెట్టుతున్నారని అన్నారు. సరుకులు రాక బయట షాపుల్లో కొనలేక పేదలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో రేషన్ కార్డు ఉండి కుటుంబ సభ్యులు పేర్లు డిలీట్ అయిన వారిని తిరిగి చేర్చాలని రేషన్ కార్డులో పిల్లల పేర్లను నమోదు చేయాలన్నారు. 14 రకాల సరుకుల తో ప్రతి పేద కుటుంబానికి సబ్సిడీ ధరలపై అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్,చేర్యాల పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, గర్నపల్లి చంద్రం, మర్యాల సత్తయ్య, గుండ్ర రవీందర్, రేపాక కుమార్, యాదారం బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మార్కెట్ విలువను తలపించేలా కాలనీల భూముల ధరలు

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్




నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంటకాలనీ, ప్రశాంత్ నగర్, ఇంద్రా నగర్‌లో 59 జీఓ కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను అధికారులు తిరిగి సర్వే నిర్వహించాలని, హైదరాబాద్ మార్కెట్ విలువను తలపించేలా కాలనీల భూముల ధరలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాళ్లకుంట కాలనీ, ప్రశాంత్ నగర్ కాలనీలో హైదరాబాదును తలపించేలా మార్కెట్ విలువను అధికారులు నిర్ణయించడం తగదన్నారు. రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో కాలకుంట, ప్రశాంత్ నగర్ కాలనీ ప్రజలు నివసిస్తున్నారని, అలాంటి పేదవారిపై ఆర్థిక భారం మోపేలా 59 జీఓ ధరలు ఉన్నాయని అన్నారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల అమాయకులు నష్టపోతున్నారని అన్నారు. దీనిపై అధికారులు మళ్లీ రీ సర్వే చేయించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. ఇంత జరుగుతున్న జిల్లా కలెక్టర్ స్పందించకపోవడం దారుణమన్నారు. దీనికి పూర్తి బాధ్యత జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, తహసీల్దార్లు వహించాలన్నారు. అధికారులు రీ సర్వే జరిపించకపోతే కాలకుంట కాలనీ, ప్రశాంత్ నగర్, ఇంద్రానగర్ బాధితులతో కలిపి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ చైర్మన్ మజర్ మాలిక్, ఎన్ఎస్ యూ ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రశద్, పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యదరీ మధు, యువజన పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్, మైనారిటీ పట్టణ ఉపాధ్యక్షులు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- మార్కెట్ యార్డ్ సందర్శించిన సీపీఐ(ఎం) బృందం



నవతెలంగాణ-చేర్యాల

అకాల వర్షాలకు మార్కెట్, కొనుగోలు కేంద్రాలలో నింపిన ధాన్యం సంచులు తడిసినవాటిని వెంటనే మిల్లర్లతో అధికారులు మాట్లాడి లోడింగ్ చేయాలని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును మంగళవారం సీపీఐ(ఎం) బృందం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకట మావో మాట్లాడుతూ మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి నింపిన ధాన్యం సంచులు తడిచిపోయాయని, ఈ ధాన్యాన్ని ఎలాంటి కోతలు పెట్టకుండా వెంటనే లోడింగ్ చేసి మిల్లుకు పంపాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు, తాలుపట్టే మిషన్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని సైతం ఏమాత్రం కోత విధించకుండా కొనుగోలు చేస్తామని, రైతులకు న్యాయం చేస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 10, 15 రోజులపాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పడిగాపుల పడాల్సి వస్తుందని తెలిపారు. సంబంధిత అధికారులు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గొర్రె శ్రీనివాస్, రేపాక కుమార్ ,పార్టీ కార్యకర్తలు బోయిని మల్లేశం, గుండ్ర రవీందర్, గర్నపల్లి చంద్రం, మర్యాల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ సంఘం, తెలంగాణ రజక సంఘాల సమితి, మేదర సంఘాల నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయినా కుల వృత్తిదారులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం, ఋణాలు పొందుటకు దరఖాస్తు చేసుకోవడానికి క్షేత్ర స్థాయి, మండల కార్యాలయంలో కొంత మంది, బీసీ కుల వృత్తి దారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాబట్టి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సకాలంలో ఆదాయ, కుల, నివాసపత్రాలు మంజూరు అయ్యే విధంగా సంబంధిత మండల అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ రజక సంఘాల సమితి జిల్లా అధ్యక్షులు నామాల నాగేష్, మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర, రజక సంఘాల సమితి కోశాధికారి రాజు. రజక సంఘం నాయకులు అమిదిపురం మహేష్ కుమార్, రాజు తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు నీలం మధు పరామర్శ

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కిష్టాయిపల్లి గ్రామంలో సుదర్శన్, మంత్రికుంట గ్రామంలో నర్సింహ కుమారుడు నరేష్, కొర్లకుంట గ్రామంలో నక్కిర్తి రాజు తల్లి సత్తెమ్మలు మృతి చెందగా.. మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ మంగళవారం పరామర్శించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని.. ఏ సహాయం కావాలన్నా అందిస్తానని వారికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నీల మధు ముదిరాజ్ యువసేన ప్రతినిధి శ్రీనివాస్ బృందం పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పెద్దమ్మ గూడెం గ్రామంలో జూన్ 3 నుంచి నిర్వహించ తలపెట్టిన నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ మాజీ మహిళ ప్రధాన కార్యదర్శి గోదావరి అంజి రెడ్డి మంగళవారం రూ.11వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి వంగేటి ప్రతాపరెడ్డి, పెద్దమ్మ గూడెం యాదవ ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారం

నవతెలంగాణ-పుల్కల్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ మండలాధ్యక్షులు దుర్గారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష పుల్కల్ ఉమ్మడి మండలంలో గత కొన్ని నెలలుగా చేపడుతున్న సుడిగాలి పర్యటనకు అపూర్వ స్పందన లభిస్తున్నదన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎలా ఉండేది.. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందంటూ ప్రజలను అడిగి తెల్సుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారన్నారు. కాగా తమ నాయకుడు దామోదర్ రాజనర్సింహకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తమ దామోదర్ రాజనర్సింహను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బోయిన శ్రీనివాస్, గ్రామాధ్యక్షులు మన్నె విట్టల్, ఉపాధ్యాయులు చాకలి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు ఉదయ్ కుమార్, మైనార్టీ యూత్ ఉపాధ్యక్షులు యండి.సాజిద్, నాయకులు ఇస్మాయిల్, మైనార్టీ ఉపాధ్యక్షులు ఎండి రజాక్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం పై గ్రామాల్లో ప్రచారం

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యామతాబాద్ శివారులోని సన్‌రైజ్ ఫంక్షన్‌హాల్‌లో నేటి ఉదయం నిర్వహించనున్న బీఆర్ఎస్ రెండో విడత ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించి హుస్సెల్లి గ్రామంలో మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనానికి జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్ రావు హాజరుకానున్నారని.. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉదయం 10 గంటల లోపు సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రచారం చేసిన వారిలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రవీందర్, భాస్కర్, వెంకట్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్, గంగావర్ నిరంజన్ రెడ్డి, వినోద్ , శ్రీనివాస్, ఇమ్రాన్ తదితరులున్నారు.

విగ్రహాల ప్రతిష్టాపనకు రూ.50 వేల విరాళం

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పెద్దమ్మ గూడెం గ్రామంలో నిర్వహించ తలపెట్టిన నవగ్రహ విగ్రహాలు బొడ్రాయి, లింగమయ్య, ఊరడమ్మ విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాలకు బిజెపి రాష్ట్ర నేత, అమీన్పూర్ కౌన్సిలర్ ఎడ్ల రమేష్ మంగళవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పెద్దమ్మ గూడెం గ్రామస్తులు ఎడ్ల రమేష్ కు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి వంగటి ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ నేత, వార్డు సభ్యులు గొల్ల శ్రీనివాస్ యాదవ్, చిన్న శ్రీనివాస్ యాదవ్, నాయకులు ఎల్లనగారి వెంకటేష్, పెద్దమ్మ గూడెం యాదవ సోదరుల బృందం, ఎడ్ల రమేష్ యువసేన బృందం పాల్గొన్నారు.

44వ రోజుకు వీవోఏల నిరవధిక సమ్మె





నవతెలంగాణ-జోగిపేట

సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 44 రోజులకు చేరింది. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమని వీవోఏలు స్పష్టం చేస్తున్నారు.

44వ వీవోఏలు చేపట్టిన సమ్మెకు అందోల్ మండల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పద్మనాభరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ రాజ్, నాయకులు సుధాకర్, వీరేశం, నారాయణలు సంపూర్ణ మద్దతు ప్రకటించి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీవోఏల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. జిల్లా నాయకులు మల్లన్న, వీ ఓ ఏ ల అధ్యక్షులు మల్లయ్య, వీ ఓ ఏ లువిజయ, స్వప్న, లక్ష్మి, సునీత, రేణుక మానస ఎం. అశోక్, లాయక్ అలీ,సుప్రియ, చంద్రిక, వీరమని, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్ : మండల కేంద్రంలో సమ్మెలో పాల్గొని వీవోఏలు మాట్లాడుతూ.. 44 రోజులుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. తమకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కార్డు, ఈఎస్ఐ, పిఎఫ్, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ నిరసనలో వీవోఏల సంఘం మండలాధ్యక్షులు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షురాలు కుమారి, కార్యదర్శి స్వప్న, ప్రధాన కార్యదర్శి బాలమని, సభ్యులు మల్లేశం, నరేందర్, మాణిక్యం, సత్యనారాయణ, మల్లప్ప, వీణ కుమారి, అలవేణి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు బ్యాంకు సేవలు విస్తరించాలి

నవతెలంగాణ-జిన్నారం

గ్రామీణ ప్రాంతాలకు మరింతగా బ్యాంక్ సేవలు విస్తరించాలని సోలక్పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోలక్పల్లిలో మంగళవారం ఏపీజీవీబీ బ్యాంకు మిత్ర కేంద్రం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పాస్ బుక్ ప్రింటింగ్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ జీఎం కే ఈ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు అయిన కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి బ్యాంకు సేవలు రావడం సంతోషంగా ఉందన్నారు. సకాలంలో రైతులకు రుణాలు అందించడం, ప్రభుత్వ పరంగా వస్తున్న అన్ని రకాల సదుపాయాలను, పథకాల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరువగా తీసుకు వెళ్లే విషయంలో బ్యాంకుల కృషి మరింతగా పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఏపీజీవీబీ సేవల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ బ్యాంకు మేనేజర్ రాజు నాయక్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. జీఎంకె సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రైతులు సకాలంలో రుణాలను చెల్లించాలన్నారు. తద్వారా వడ్డీ భారాన్ని మోయాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ ఏజీఎం అండ్ ఆర్ఎం ఎస్ ఎల్ ఎన్ ప్రసాద్, ఎల్‌డిఎం గోపాల్, జిన్నారం ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖ మేనేజర్ రాజు నాయక్, అఖిలేష్ కుమార్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుడబుక్కల కులస్తులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-జహీరాబాద్



బుడబుక్కల కులస్తులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ నాయకులు వై.నరోత్తం అన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో గల పలువురు బుడబుక్కల కులస్తులు మంగళవారం ఆయన్ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. తాము చాలా నిరుపేద లమని.. ఆర్థికంగా, విద్యాపరంగా అన్ని రకాలుగా వెనుకబడి ఉన్నట్టు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమను ప్రభుత్వం ఏ విధంగానూ ఆదుకోవడం లేదన్నారు. కొందరు తమజాతి పట్ల వ్యంగ్యంగా మాట్లాడుతూ.. కించపరుస్తున్నారన్నారు. తమకు ప్రభుత్వ పథకాలు, డబుల్ బెడ్ రూమ్‌లు, ఉపాధి, వ్యాపారం చేసుకోవడానికి సబ్సిడీపై రుణాలు అందివ్వాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నరోత్తం మాట్లాడుతూ.. వారి సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులు జగదీశ్వర్, జహీరాబాద్ అధ్యక్షులు గుమాస్తా బీమ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుమాస్తా భరద్వాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నామ మాత్రంగా ఐకేపీ సెంటర్లు

నవతెలంగాణ-పటాన్‌చెరు



రైతుల ధాన్యం కొనుగోలు చేసే ఐకేపీ సెంటర్లు నామ మాత్రంగానే ఉన్నాయని పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. మండలంలోని ముత్తంగిలో మంగళవారం ఆయన విలేఖరుల మాట్లాడుతూ.. ఇటీవలే వర్షాలకు తడిసిన వడ్లను ఎండిన తరువాత కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. వడ్లు భద్రపరుచుకోవడానికి సరైన వసతి లేక వడ్లు నింపుకోవడానికి సంచులు లేక ఇబ్బందులు పడుతున్నారని.. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కనీసం కొనుగోలు చేసిన వారికి సమయానికి నగదు కూడా ఇవ్వట్లేదన్నారు. దానికి తోడు తరుగు భారం కూడా రైతులపై మోపుతున్నారన్నారు. నష్టపోయిన రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐకేపీ సెంటర్లలో సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడు దేవేందర్ గౌడ్, భారతి నగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్,జిల్లా కిసాన్ మోర్చా నాయకులు వీరారెడ్డి, బిజేవైయం అసెంబ్లీ కన్వీనర్ రాజ్ గోపాల్ యాదవ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్ రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ సంగమేష్, రమణ, విజయ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-న్యాల్‌కల్

మద్యం మత్తులో చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మలకల్‌పాడు గ్రామంలో జరిగింది. హద్నూర్ ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మలకల్ పాడ్ గ్రామానికి చెందిన పి. శ్రీనివాస్ రెడ్డి (35) గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం తాగిన మైకంలో వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



వైభవంగా సంజీవ్‌కుమార్ కుమారుడి నిశ్చితార్థం

నవతెలంగాణ-జహీరాబాద్

ప్రముఖ జ్యువెలరీ వ్యాపారవేత్త సంజీవ్ కుమార్ కుమారుడి నిశ్చితార్థం జహీరాబాద్ పట్టణంలోని ఎస్వీ కళ్యాణమండపంలో సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ నిశ్చితార్థానికి ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, టీపీసీసీ నాయకులు వై నరోత్తం, జహీరాబాద్ డీఎస్పీ వి.రఘు, ఎస్సై శ్రీకాంత్‌లు హాజరయ్యారు. వారితోపాటు మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రామ కృష్ణ రెడ్డీ, మాజీ మున్సిపల్ చైర్మన్ లు మంకల్ సుభాష్, అల్లాడి నర్సింహులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మొహివుద్దిన్, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ప్రదాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డీ, సీనియర్ నాయకులు శశికాంత్, ఇజ్రాయేల్ బాబీ, మాణిక్ రెడ్డీ, సంజీవ్ జీవ్, రంగ అరుణ్ కుమార్ , బాసిత్, ముబీన్ ఆఫీస్, అల్లాడి కుటుంబ సభ్యులు వంశీ , కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దశాబ్ది ఉత్సవాలపై అవగాహనా సమావేశం

నవతెలంగాణ-న్యాల్కల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి చేపట్టిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై వివిధ శాఖల అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాఘవరావు, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి మంగళవారం అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దశాబ్ది వేడుకలను ఘనంగా జరుపుకొనేలా ఆయా శాకల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. జూన్ 2 తేదీ నుంచి 22 తేదీ వరకు 21 రోజుల పాటు ఉత్సవాలు జరిగేలా ఏర్పాటు చేసుకోవాలని.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ ఉత్సవాలకు 2, 3 తేదీల్లో రైతు వేదికలను మామిడి తోరణాలతో, పూలతో, విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వం చేపట్టిన రైతు బంధు, రైతుబీమా వ్యవసాయ పంటలపై మండల ఏవో, ఏఈవోలు ప్రసంగాలు చేయాలన్నారు. ఈ సమావేశాలకు 1000 మంది వచ్చేలా చూడాలన్నారు. రైతులతో సామూహిక భోజనాల ఏర్పాటు, 4న పోలీసుల ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీస్ నినాదం, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల కృషి, సమర్థవంతమైన సేవలపై కార్యక్రమాలు, హెల్మెట్‌తో ర్యాలీ చేపట్టాలన్నారు. సాయంత్రం ప్రజలు ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బందితో సామూహిక భోజనం చేయాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు ఏలాంటి లోటు పాట్లు చూసుకోవాలన్నారు. ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీఓ సురేష్, ఏపిఎం కుమార్, పంచాయతీ సెక్రటరీలు రవీందర్,నాగభూషణం, సంతోష్ తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి

నవతెలంగాణ-చేర్యాల

బీజేపీ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సిఐటియు 53 వ, ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని అంగడి బజార్,వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సిఐటియు జెండాలను సిఐటియు పట్టణ కన్వీనర్ రాళ్ల బండి భాస్కర్,హమాలి సంఘం నాయకుడు బియ్య కిష్టయ్య ఆవిష్కరించారు.అనంతరం ఏర్పాటుచేసిన సదస్సులో కళావతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో తొమ్మిది ఏళ్లుగా సరళీకృత ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తుందని విమర్శించారు. సంఘటిత,అసంఘటిత రంగ ఉద్యోగులు, కార్మికుల జాతీయ సమ్మెలు, రాష్ట్రవ్యాప్త పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయని తెలిపారు. కార్మిక వర్గ ఐక్యతను పక్కదారి పట్టించేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, సంతోష్, వెంకటవ్వ, కనకవ్వ, కాజా, వెంకటేష్, సుజాత, సరోజన, పద్మ, కిష్టయ్య, చంద్రారెడ్డి, మహేష్, లక్ష్మయ్య,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుడికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-చేగుంట

పేద క్రీడాకారులకు తమ వంతు సహాయం ఎప్పుడూ అందిస్తానని దుబ్బాక బీజేపీ కో కన్వీనర్ గోవింద్ కృష్ణ అన్నారు. చేగుంట మండలం చిన్నశివునూర్ గ్రామానికి చెందిన రగ్బీ క్రీడాకారులకు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చేగుంటలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ రగ్బీ సెలెక్షన్‌లో మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన అరవింద్ సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగే ఐదవ రాష్ట్ర స్థాయి జూనియర్ పోటీల జట్టుకు ఎంపికయ్యారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి రాష్ట్రస్థాయి పోటీలకు పోలేని పరిస్థితిలో ఉన్న విషయం తెలుసుకొని ఆర్థిక సహాయం అందజేశానని గోవింద్ కృష్ణ తెలిపారు.

బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి తరలిరావాలి



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాదులోని గోపనపల్లి లో నూతనంగా నిర్మించిన బ్రాహ్మణ సదన్ ప్రారంభానికి మండలం నుంచి బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలి రావాలని బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ మండల అధ్యక్షులు రామచంద్ర చారి, నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు కిషన్ రావు దేశ్పాండే, గౌరవాధ్యక్షులు కృష్ణ శర్మలు కోరారు. మంగళవారం పెద్ద శంకరంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బ్రాహ్మణ సంక్షేమ కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి బ్రాహ్మణులను ఆదుకుంటున్నారన్నారు. సంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు సురేష్ జోషి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, సభ్యులు రాము, అనంతరాజ శర్మ, సంతోష్ శర్మ, ఫనిందర్, రంగారావు, నాగరాజ్ శర్మ , మహేష్ శర్మ, అభిలాష్, రామాచారి, సంగమేశ్వర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బి కొండాపూర్‌లో పోచమ్మ విగ్రహ ప్రతిష్ట



నవతెలంగాణ- చేగుంట

చేగుంట మండలం బి కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఎంపిటిసి గూడెం నవీన్ దేవాలయానికి రూ.16 వేలతో మైక్ సెట్‌ను బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆలయానికి నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని బుధవారం అమ్మవారికి బోనాలు ఉంటాయని, గ్రామంలో పాడి పంట, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోశల బాల్ నర్స్, ఉప సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంక్ మిత్రకు ప్రింటింగ్ మిషన్ అందజేసిన

ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ ఆశాలత



నవతెలంగాణ-మర్కుక్

బ్యాంకు మిత్ర సేవలను ఖాతా దారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ ఆశాలత సూచించారు.మంగళవారం మండలం లోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో ఏపీజీవీబీ ప్రజ్ఞాపూర్ బ్యాంక్ మిత్ర కో - ఆర్డినేటర్ తోట్ల వినోదకు ప్రింటర్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో బ్యాంకు మిత్రులు ఖాతాదారులకు సేవలు అందజేయాలని సూచించారు.బ్యాంకు మిత్రకు ప్రింటింగ్ మిషన్ ను అందుబాటులోకి తేవడం వల్ల చుట్టూ ఉన్న 10 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగమని ఈ అవకాశం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి రాములు గౌడ్ ,ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, ఏపీజీవీబీ ప్రజ్ఞాపూర్ మేనేజర్ సూరజ్, ఛానల్ మేనేజర్ రాజు ,ఫీల్డ్ ఆఫీసర్ లు లక్ష్మి సుజాత ,జాషువా గ్రామస్తులు తదితరులున్నారు.

అభివృద్ధియే ప్రధాన లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి ప్రధాన లక్ష్యం కోసం కృషి చేస్తున్నట్టు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి తెలిపారు. మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ బొగ్గుల చందు ఆధ్వర్యంలో బీసీ కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అభివృద్ధియే ప్రధాన లక్ష్యంగా తాను ముందుకు వెళ్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింగరావు, యాదగిరి, భిక్షపతి, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలి

ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్

నవ తెలంగాణ-కొండపాక

జూన్ 2 నుంచి 22 వరకు జరగబోయే దశాబ్ది ఉత్సవాలను అన్ని గ్రామాలలో ప్రజలంతా పండుగ వాతావరణంలో నిర్వహించాలని రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రవీందర్, కొండపాక మండలం రైతుబంధు సమితి కోఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్యలు అన్నారు కొండపాక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాం రెడ్డి అధ్యక్షతన దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై నా వారు మాట్లాడుతూ అవతరణకు ముందు గ్రామాల పరిస్థితి నేటి గ్రామాల అభివృద్ధి మారిన పరిస్థితిపై చర్చించారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రతి పేదవాడికి అందుబాటులో ఉండేలా చూడడం పట్ల పక్క రాష్ట్రాల సైతం తెలంగాణ వైపు కన్నెత్తి చూస్తున్నారన్నారు 20 రోజులపాటు జరగబోయే దశాబ్ది ఉత్సవాలను గ్రామాలలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా వివరిస్తూ పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురి దేవేందర్ రెడ్డి, ఎంపిటిసి ల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా గౌడ్, పంచాయతీరాజ్ ఏఈ తిరుపతిరెడ్డి, అగ్రికల్చర్ ఏవో ప్రియదర్శిని వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు



నక్కరాములుకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నక్క రాములుకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉండి పార్టీకి సేవలందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నక్క రాములు ఎంతో కృషి చేస్తున్నారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు అన్నారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు సూచనలు సలహాలు పాటిస్తూ ముందుకు



వెళ్తున్నారని ఆయన తెలిపారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంజనేయులు, శివారెడ్డి, జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్వయంగా ఉపాధికి శిక్షణ

నవతెలంగాణ-తొగుట

నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ప్రారంభ మవుతుందని ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట పోలీస కమిషనర్ ఆదేశానుసారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. నాబార్డ్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయి మెంట్ ఇనిస్టిట్యూట్ ద్వారా 45 రోజుల పాటు నిపుణులైన ఫ్యాకల్టీతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సీసీ కెమెరాలు, ఏసీలు, రిఫ్రిజ్ రేటర్ సర్వీస్, రిపేర్ చేసేందుకు యువతి, యువకులకు మంచి అవకాశం ఉందన్నారు. జూన్ 1వ తేదీ నుంచి సిద్దిపేట కోటిలింగాల ఆలయం ఆవరణలో శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.శిక్షణ కు హాజరయ్యే వారికి ఉచిత భోజనం వసతి ఉంటుందన్నారు. శిక్షణ పొందే వారు బుధవారం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కోచింగ్ పూర్తి అయిన తరువాత బ్యాంకు అధికారులతో మాట్లాడి ముద్ర లోన్ ఇప్పించి వారికి స్వయం ఉపాధి కల్పించే విదంగా కృషి చేసే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వివోఎల సమ్మె ఐద్వా సంఘీభావం

నవ తెలంగాణ-దుబ్బాక

తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ వివోఏలు చేస్తున్న నిరవధిక సమ్మె నాలుగు రోజులకు చేరింది. దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సెర్ప్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న వివోఏల నిరవధిక సమ్మెకు మంగళవారం ఐద్వా సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఐకెపి వివోఏలను రాష్ట్రప్రభుత్వం వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా



ప్రకటించాలని, వారికి రూ.26 వేల కనీస వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. వివోఏల మండలాధ్యక్షుడు జింక మల్లేశం, ఉపాధ్యక్షులు జమున, బాబు, పలువురు వివోఏలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నవ తెలంగాణ-దుబ్బాక



దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 18వ వార్డులో మార్కండేయ దేవాలయం నుంచి వాటర్ ప్లాంట్ వరకు టియుఎఫ్ఐడిసి నిధుల తో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పురపాలిక చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి మంగళవారం పరిశీలించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ తుమ్మ భానుచందర్, బూత్ ఇంచార్జ్ అంకం దుబ్బయ్య, బిఆర్ఎస్ నాయకులు గోనె మధు, పలువురున్నారు.

జూన్ 1న 5కే రన్

నవ తెలంగాణ-దుబ్బాక

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 ఉదయం 5.30 లకు దుబ్బాక బస్టాండ్ నుంచి హబ్సిపూర్ అంబేద్కర్ విగ్రహ చౌరస్తా వరకు "5 కే రన్" నిర్వహిస్తున్నట్లు సీఐ మున్నూర్ కృష్ణ, ఎస్ఐ బత్తుల మహేందర్ తెలిపారు.ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, యువతి యువకులు పాల్గొని 5కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-మర్కుక్

మండలం పాములపర్తి గ్రామానికి చెందిన జుట్టు యాదగిరి (55) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మంగళవారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ మృతుడి కుటుంబానికి పరామర్శించి రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. ఆయనతో పాటుగా జుట్టు సుధాకర్, మల్లేశం ,స్వామి, యాదగిరి ,తదితరులున్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత అందజేత



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ గ్రామానికి చెందిన రాగుల కిష్టయ్య గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిపాలై అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసుకున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా సీఎం సహాయనిధి ద్వారా ఒక లక్ష రూపాయల చెక్కు మంజూరు అయ్యింది. మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంపిపి బాలేశం గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్‌లు చెక్కును లబ్ధిదారు లకు అందజేశారు. బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగరాజు కరుణాకర్ మండల కోఆప్షన్ సభ్యులు ఎక్బల్, వార్డ్ సభ్యులు మహేష్, బాలనర్సయ్య, ఫాతిమాహలీమ్, కొండపోచమ్మ డైరెక్టర్ కనకయ్య, నాయకులు నర్సింలు, కనకయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

వివోఎలా సమ్మెకు పంచాయతీ కార్మికుల మద్దతు



నవ తెలంగాణ-కొండపాక

వివోఎల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పంచాయతీ కార్మికులు తెలిపారు. వివోఎలా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో వారికి పూర్తిగా సంఘీభావాన్ని ప్రకటించి ఐక్య పోరాటాలు నిర్వహించడానికి వారి వెన్నంటి ఉంటామన్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బర్మా కొమురయ్య, కొండపాక మండల కార్యదర్శి జాలిగామ ప్రభాకర్ నాయకులు పల్లె శ్రీనివాసు గొడుగు నారాయణ, రాజు, సుధాకర్, పంజా శ్రీనివాస్ నరసయ్య మల్లేశం, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

మునిగడపలో పౌర హక్కులను దినోత్సవం

జగదేవపూర్ ఎస్సై కృష్ణమూర్తి



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిధిలోని మునిగడప గ్రామంలో మంగళవారం నాడు గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి ఐలయ్య స్థానిక, ఎస్సై కృష్ణమూర్తి, ఆర్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పౌర హక్కులను కాలరాస్తూ ఎవరిపైనైనా ఆజమాయిసి చెలాయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. భారతరాజ్యాంగం చెప్పిన విధంగానే ప్రతి ఒక్కరు నడుచుకొని వారి హక్కులను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఉప సర్పంచ్ లావన్య మల్లేషం, బిబీజేఐవెం మండల అధ్యక్షుడు గుర్రం శ్రీధర్, వార్డ్ సభ్యులు నాయకులు దుర్గయ్య,రాజు, బాబు, సత్యం, పాల్గొన్నారు.

ఆయుష్‌లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ చేయాలి



నవ తెలంగాణ-దుబ్బాక

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆయుష్ శాఖల్లోని పీహెచ్ సి ల్లో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) స్కీం కింద పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఫార్మసిస్టులను రెగ్యులరైజేషన్ చేయాలని ఎన్ హెచ్ ఎం ఆయుష్ కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జే.రంజిత్ కోరారు.గత 15 ఏళ్లుగా ఆయుష్ విభాగంలో కాంట్రాక్టు ఫార్మసిస్టులుగా పనిచేస్తున్న తమకు నోటిఫికేషన్ ఇచ్చి ఖాళీలను భర్తీ చేయాలని సీఎం కేసీఆర్ కి విజ్ఞప్తి చేశారు.గతంలోనే తమకు 20 శాతం వెయిటేజీ కల్పించిందని గుర్తు చేశారు.గతేడాది జీవో నెంబర్ 35 ద్వారా ఖాళీల భర్తీకి అనుమతినిచ్చినా నేటికీ భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం,వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు లు తమపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఫార్మసిస్టులను నోటిఫికేషన్ ద్వారా రెగ్యులరైజేషన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా స్థాయి టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక



నవ తెలంగాణ-సిద్దిపేట

జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కాలేజీ మైదానంలో సీనియర్ మెన్, ఉమెన్ క్రీడాకారులకు పోటీలు నిర్వహించి, జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు కాటం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి క్యాతం రాజ్ కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా 42 వ వార్డు కౌన్సిలర్ కాటం శోభా రఘురాం మాట్లాడుతూ సిద్దిపేటలో మంత్రి హరీశ్ రావు క్రీడలకు పెద్దపీట వేసి, క్రీడా హబ్ ను ఏర్పాటు చేసి , అన్ని క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు. బహుమతుల ప్రధానానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షులు ఎండి ఫక్రుద్దీన్ రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ప్రయాణ ఖర్చుల నిమిత్తము ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, అనంత రాములు చారీ, వెంకటేష్, కనకయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష

నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మండల స్థాయి సన్నాక సమావేశాన్ని ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తుందని ఆయన తెలిపారు మండల స్థాయి సన్నాక సమావేశానికి ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రగతిని పల్లెపల్లెనా వివరించాలి

నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొమ్మిదేండ్లలో సాధించిన ప్రగతిని పల్లెపల్లెనా ప్రజలకు వివరించాలని, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగలా నిర్వహించాలని మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్‌లు కోరారు. మంగళవారం మర్కుక్ రైతు వేదికలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి ఏపీడీ కౌసల్య దేవి ముఖ్య అతిథులు హాజరై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండల పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. జూన్ 2న పతాకావిష్కరణ, దశాబ్ది ఉత్సవ సందేశంతో ఉత్సవాలు ప్రారంభమై జూన్ 22న అమరవీరుల సంస్మరణ సభ, అమరవీరుల స్తూపం ఆవిష్కరణతో ముగుస్తాయని తెలిపారు. 20 రోజుల పాటు ఊరూరా పండుగ వాతావరణంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలన్నారు. తెలంగాణ ప్రగతిని ప్రతిఒక్కరికి తెలిసేలా ఎలుగెత్తి చాటాలని కోరారు. రాష్ట్రం రాక ముందు, వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతువేదికల వద్ద ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి భోజనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, తహశీల్దారు భాగ్య రేఖా, ఎవో నాగేందర్ రెడ్డి, రైతు బందు సమితి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి,



పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, సర్పంచులు భాస్కర్, నర్సింలు, ప్రవీణ్, ఆశోక్, భాగ్య బిక్షపతి, మాధవి రాజిరెడ్డి, లక్ష్మీ రాములు గౌడ్, మెతుకు మంజుల శ్రీరాములు, అరుణ నర్సింలు, ప్రసన్న సుధాకర్ రెడ్డి, పుట్ట మంజుల నర్సింలు, ఎంపీటీసిలు గోలి నరేందర్, చైతన్య శంకర్ రెడ్డి, ధనలక్ష్మి కృష్ణ,లక్ష్మీ రాములు గౌడ్,గాయత్రి బాలనర్సయ్య, ఉపసర్పంచ్ స్వామి,వివిధ శాఖల డైరెక్టర్లు బబ్బూరి రాందాస్ గౌడ్,జాలని బాలనర్సయ్య,అత్మ కమిటి డైరెక్టర్ బబ్బూరి రాములుగౌడ్, దుబ్బాక యాదగిరి, సంజీవులు, టి.యాదగిరి, వివిధ శాఖల ఏఈలు,పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు తదితరులున్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ముందు వరుసలో నిలిపారని సిద్దిపేట నియోజకవర్గ సమన్వయ కర్త నార్లపురం రాంమోహన్, మండల పరిశీలకులు భూక్యా బిక్షపతి నాయక్, అధ్యక్షులు గోవిందారం రవిలు అన్నారు. మంగళవారం నంగునూరు మండలంలోని జేపీ తండా, పాలమాకుల, రాజగోపాల్ పేట గ్రామాలలో మండల బిఆర్ఎస్వీ అధ్యక్షులు గోవిందారం రవి అధ్యక్షతన బీఆర్ఎస్వీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణ ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, సర్పంచ్‌లు ఏల రాజేంద్ర,పంగ కుమార్, భూక్యా బిక్షపతి నాయక్, బీఆర్ఎస్ నాయకులు కమాల్ షరీఫ్,రంగు రాజు,వేణు చక్రవర్తి, ఇజారుద్దీన్, పరుమాండ్ల మల్లేశం, జాజల చందు,పరమేశ్వర్, వెంకటేష్, ఐలయ్య, నరేష్, సంజీవులు, మధు, యాదగిరి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల ముఖ్య నాయకులు ఆధ్వర్యంలో జేపీ తండా గ్రామ అధ్యక్షులుగా పిట్టల నరేష్, పాలమాకుల గ్రామ అధ్యక్షులుగా రాకేష్ యాదవ్, రాజగోపాల్ పేట గ్రామ శాఖ



అధ్యక్షులుగా గోవిందారం బిక్షపతి సమన్వయకర్తగా ఆకారం మోహన్ 18 మందితో పూర్తి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలి

వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి

నవ తెలంగాణ-తొగుట

దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా యువత పని చేయాలని వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాన్గల్ గ్రామంలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన, సోషల్ మీడియా నూతన కమిటీల ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు కాన్గల్ గ్రామంలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన, సోషల్ మీడియా కమిటీలు ఎంపిక చేశామన్నారు. రాబోయే రోజుల్లో దుబ్బాకపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా యువకులు క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. యూత్ అధ్యక్షునిగా లింగు పల్లి బాలరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా నిమ్మరాజు నరేష్, సోషల్ మీడియా అధ్యక్షునిగా తరిగొప్పుల చరణ్‌లను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ దోమల కొమురయ్య, మండల యూత్ అధ్యక్షుడు



అరుణ్ కుమా ర్,మండల బాధ్యులు అనిల్ కుమార్, పరమేశ్వర్ రెడ్డి, బండారు రమేష్ గౌడ్,సురేష్ గౌడ్,బైరగౌడ్, బైరారెడ్డి,కోల శ్రీకాంత్, రమేష్ గౌడ్, కృష్ణ,ప్రశాంత్, సందీప్, ఆంజనేయులు, నిఖిల్, పిఏసీఎస్ డైరెక్టర్ శ్రీధర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ లు భాస్కర్ రెడ్డి, యువ కులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

రామేశ్వరంపల్లిలో నూతన బీఆర్ఎస్ కమిటీలు ఏర్పాటు
మెదక్ ఎంపీతోనే దుబ్బాక అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ గ్రామ కమిటీలు అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ పాపని సురేష్ గౌడ్ కోరారు. మంగళవారం ఎంపీ ఆదేశానుసారం అక్బరుపేట్ భూంపల్లి మండల రామేశ్వరంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన,సోషల్ మీడియా కమిటీలు వేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి క్రియాశీలకంగా పని చేసేలా కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. తదనంతరం బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ పాపని సురేష్ గౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి గెలవడం ఖాయమన్నారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి మెదక్ ఎంపీతోనే సాధ్యమన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూజారి మల్లేశం, కూడవెల్లి దేవాలయం చైర్మెన్ పూజారి చంద్రం ,ఉపసర్పంచ్ రవి, అధ్యక్షుడు గొల్ల యాదగిరి, మాజీ యంపిటీసీ బండారు స్వామి గౌడ్,సీనియర్ నాయకులు డాక్టర్ కృష్ణ, కుమార్, అశోక్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవారాజ్, యాదవ్, యువజన నాయకులు ప్రశాంత్ గౌడ్, నర్సింలు, లింగం, సత్యనారాయణ, స్వామి గౌడ్, విద్యార్థి నాయకులు యువత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



నవ తెలంగాణ - దౌల్తాబాద్

సీఎం సహాయ నిధి ద్వారా నిరుపేదలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని గాజులపల్లి సర్పంచ్ అప్పవారు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలో గాజులపల్లి గ్రామనికి చెందిన గొల్లపల్లి బాలలక్ష్మి 14000 ,శే రుపల్లి బందారం గ్రామానికి చెందిన జోడు నరసవ్వ 15వేల రూపాయలు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, వార్డ్ సభ్యులు బోయిని ప్రవీణ్, మారుపాక కనకయ్య, గొల్లపల్లి ,సహాదేవ్, యూత్ సభ్యులు మారుపాక యాదమ్మ, దూదేకుల శాదుల్, దాసరి రాజు కనకయ్య నిఖిల్ రెడ్డి శ్రీశైలం బాలు ఎల్లం నరేందర్ బాలు ప్రవీణ్ ఎంపీటీసీ జోడి నవీన్ కుమార్, జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూత్ సన్నాహక సమావేశం



నవ తెలంగాణ మిరు దొడ్డి

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశానుసారంగా మిరుదొడ్డి మండల కేంద్రంలో టీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో యువకులతో కలిసి యూత్ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మిరుదొడ్డి మండల అధ్యక్షులు తోట అంజిరెడ్డి, యూత్ అధ్యక్షులు కుమార్ మాట్లాడుతూ దుబ్బాక ఉప ఎన్నికల్లో కల్లిబల్లి మాటలు చెప్పి గెలిచిన రఘునందన్‌రావు ఇప్పటికైనా దుబ్బాక ఏం చేసావో చెప్పాలన్నారు. రైతులకు కాడెడ్లు ఇస్తున్నావు ఇవ్వలేదు నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వలేదు ఇప్పటికైనా నీ మాటలు నమ్మడం లేదని మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతం చేయడానికి అందరు కంకణ బద్ధులై పని చేయాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేసి ఎన్నికల్లో ప్రభాకర్ రెడ్డిని గెలుపే లక్ష్యంగా దుబ్బాక నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రత్యేక కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. మిరుదొడ్డి యూత్ అధ్యక్షులుగా మద్దెల నరేష్, ఉపాధ్యక్షులుగా పసులకడి తిరుపతి, ఎర్రోళ్ల చందు , సోషల్ మీడియా అధ్యక్షులుగా పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షులుగా ధర్మారం శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షులు అంజిరెడ్డి, ఎంపీటీసీ ధర్మారం లక్ష్మి మల్లయ్య మండల కోఆప్షన్ మెంబర్ హైమత్ కమిటీ బాధ్యతలు బుర్ర సతీష్ నిర్ల నరేష్ వంగ నవీన్ ఏవి రాకేష్ వేముల సుధీర్ నిమ్మ నితిన్ ప్రశాంత్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు,

కొత్త రేషన్ కార్డులు జారీ ఎప్పుడో?

నవ తెలంగాణ మెదక్ టౌన్

కొత్త రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం జాప్యం చేయడంతో లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం కనిపించడం లేదు. ముమ్మందు ఎన్నికలు వస్తుండడంతో జూన్ 1వ తేదీ నుండి కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నారని, పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పౌరసరఫరాల శాఖ వేగవంతం చేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగుతుంది. దీంతో కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్నారని లబ్ధిదారులు మీసేవ, ఈసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు జారీ విషయంలో ఎలాంటి ప్రతిపాదన లేదని పౌరసరఫరాల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలో మొత్తం 2,14,091 రేషన్ కార్డులు ఉండగా అందులో 2,00,230 ఆహార భద్రత కార్డులు, 13,794 అంత్యోదయ, 67 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డు లబ్ధిదారులకు 6 కిలోలు, అంత్యోదయ కార్డు కలిగిన వారికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు కలిగిన వారికి 10 కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. 2018 నుంచి రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిపివేయగా, వచ్చిన ధరఖాస్తులలో అర్హులైన వారిక 2021 జులై మాసంలో 2200 కార్డులు పంపిణి చేసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికీ 30000 వరకు రేషన్ కార్డులు మార్పులు, కొత్త పేర్లు నమోదుకు సంబంధించిన అప్లికేషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎటువంటి సమాచారం లేదు

ఇప్పటి వరకు వచ్చిన ధరఖాస్తుకు సంబంధించిన అప్రూవ్, రిజక్ట్ చేసే అప్షన్ లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం తమకు అందలేదని ఆయన తెలిపారు.



ఇప్పటికి మా పిల్లల పేర్లు నమోదు చేయలేదు: చాప శ్రీహరి

ఇప్పటికి మా పిల్లల పేర్లు నమోదు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా మా రేషన్ కార్డులో పిల్లల పేర్లు నమోదు కాలేదు. ప్రభుత్వం రేషన్ కార్డులు నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వస్తుంది.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి









తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం పద్మ

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మెను విరమింపజేయడానికి ప్రభుత్వం చర్చలు జరిపి పరిష్కారం చూపాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం పద్మ అన్నారు. ముస్తాబాద్ చౌరస్తాలో ఐకేపీ వీవోఏలు చేస్తున్న నిరోధిక సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పడితే ప్రజలందరికీ కష్టాలు పోతాయని, కాంట్రాక్టు పద్ధతిలో ఉన్న ఉద్యోగాలు అనీష్ట్న పర్మినెంట్ చేస్తామని, ఉన్న ఉద్యోగులకు అందరికీ పని భద్రత కల్పిస్తామని, వేతనాలు పెంచుతామని నమ్మబలికి నేడు 9 సంవత్సరాలు పూర్తవుతున్నా ఐకేపీ వీవోఏలకు అతీగతి లేదన్నారు. ఈ ప్రభుత్వంతో విసుగు వేసారిపోయి 44 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. వీవోఏలు శ్రమకోర్చి ప్రభుత్వానికి గొప్ప కీర్తి వచ్చేలా కృషి చేసిన వారి జీవితాల్లో ఎలాంటి మార్పు జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గొప్పలకు పోకుండా కష్టపడి పని చేస్తున్న ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగుల గుర్తించి కనీస వేతనం ఇచ్చే విధంగా వారితో చర్చలు జరిపి సమ్మెను వివరింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అనిత,నరసింహారెడ్డి, లక్ష్మయ్య, లావణ్య, సుజాత,బాలమని,మంజుల, సుష్మ, వంశీ, మల్లేశం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- గజ్వేల్ : రాష్ట్రవ్యాప్తంగా 40 రోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించడానికి సానుకూలంగా చర్చలు జరపాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. గజ్వేల్‌లో కొనసాగుతున్న సమ్మె శిబిరం వద్ద ఆయన మంగళవారం మాట్లాడుతూ పెరుగుతున్న ధరలతో 3900 కుటుంబాలు గడవక కుటుంబాల్లో గొడవ అవుతుందని అన్నారు. ప్రతినెలా కోట్లాది రూపాయలు బ్యాంకులో జమ చేస్తున్న వీవోఏల బతుకులు మాత్రం దిగజారుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8 సంవత్సరాలుగా రూ.పదివేల వేతనం అందజేస్తున్నారని తెలిపారు. ధనిక రాష్ట్రంలో మాత్రం వీవోఏలకు ఇవ్వడానికి డబ్బులు లేవా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ సమావేశాలకు వేలాది మందిని డ్వాక్రా మహిళలను సమీకరిస్తున్న వీవోఏలు వచ్చే ఎన్నికల్లో డ్వాక్రా మహిళల ఓట్లు అవసరం లేదా అని అన్నారు. వెంటనే ప్రభుత్వం సానుకూలంగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీ ఐ టీ యూ నాయకులు రంగారెడ్డి చారి వివో ఏ అధ్యక్షులు రుక్మిణి, కనకయ్య నాయకులు సంధ్యా, లక్ష్మి, లతా, రాణి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ మిరు దొడ్డి : వీవోఏలపై రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని ఆ సంఘం జిల్లా నాయకులు మహేష్ అన్నారు. మంగళవారం వీవోఏల సమ్మె యథావిధిగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వీవోఏలకు కనీస వేతనం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో వీవోఏల నిరవధిక సమ్మె కొనసాగుతోందన్నారు. 45 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, రాష్ట్ర ప్రభుత్వానికి వీవోఏలు విన్నవించినా పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే వీఓఏలకు 26 వేల కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సమ్మెను ఉధృతం చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివోఏలు సత్తిరెడ్డి స్వప్న, జమున, మంగమ్మ కనకయ్య, శ్యామల ,లక్ష్మి, ప్రియాంక ,లావణ్య నసీరుద్దీన్ ,కనకయ్య ,మైపాల్ పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు: కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడేది సీఐటీయూ ఒక్కటేనని సీఐటీయూ నంగునూరు మండలం నాయకులు దేవులపల్లి రాజమౌళి అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నంగునూరు మండల కేంద్రంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే సీఐటీయూ మాత్రమేనని 1970 లో ఏర్పడిన నాటినుండి కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించి అనేక హక్కులు సాధించుకున్నారన్నారు. రాబోయే కాలంలో కార్మికుల పక్షపాతిగా ఉంటూ వారి సమస్యలపై అలుపు ఎరగని పోరాటాలు నిర్వహించి హక్కులు సాధించుకుంటామన్నారు. రాబోయే కాలంలో కార్మికులకు మరింత చేరువలో ఉంటూ పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, శ్రీనివాస్, కిషన్, దేవులపల్లి నరసవ్వ, నరసింహులు, కనకయ్యా, హమాలీ, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలతో మండల సర్వసభ్య సమావేశం

- సమయపాలన పాటించని ప్రజాప్రతినిధులు, అధికారులు
- నివేదికలు చదవగానే సభ నుండి వెళ్లిపోయిన అధికారులు
- పరిష్కారం కావడం లేదంటూ ప్రజాప్రతినిధులు ఆగ్రహం





నవ తెలంగాణ రాయపోల్

మండల స్థాయి సర్వసభ్య సమావేశం ద్వారా గ్రామాలలో ఉండే సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామాలకు రావలసిన నిధులు మంజూరు గురించి ప్రభుత్వానికి పై అధికారులకు తెలియజేసే ఉద్దేశంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సాధన సమావేశం నిర్వహిస్తారు. మంగళవారం రాయపోల్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమయపాలన పాటించకపోవడంతో సమావేశం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. వచ్చిందే తక్కువ మంది ప్రజాప్రతినిధులు అధికారులు శాఖల వారీగా నివేదికలు సభా దృష్టికి తీసుకువచ్చి అధ్యక్షురాలు అనుమతి లేకుండానే వారు నివేదిక అయిపోగానే అధికారులు వెళ్లిపోవడం గమనార్హం. వచ్చిన ప్రజాప్రతినిధులు మండలంలో నిర్వహించే సర్వసభ్య సమావేశం నామమాత్రంగానే జరుగుతుందని మూడు నెలల క్రితం సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు ఒకటి కూడా పరిష్కారం కావడంలేదని గ్రామాలలో నిర్వహించిన పనుల బిల్లులు రాక అవస్థలు పడుతున్నామన్నారు. సమావేశానికి వచ్చిన కొంతమంది సంతకం చేసి వెళ్లిపోవడం ఆశ్చర్యకరం. సమావేశంలో ఉన్న ప్రజాప్రతినిధులు గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటిసి యాదగిరి మాట్లాడుతూ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో వారికి లాభదాయంగా ఉండే నాసిరకం విత్తనాలను విక్రయించి రైతులు పంట దిగుబడి రాక నష్టపోయిన పట్టించుకోవడంలేదని, నాణ్యమైన విత్తనాలను విక్రయించేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్ మాట్లాడుతూ గతంలో జరిగిన వరుసగా మూడు సాధారణ సర్వసభ్య సమావేశాలలో రాయపోల్ మండల కేంద్రం నుండి సిద్దిపేట జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని పదేపదే అధికారులకు విన్నవించినా నేటికీ సమస్య పరిష్కారం కావడంలేదని జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్పంచులు వెంకటరామిరెడ్డి, ప్రవీణ్ మాట్లాడుతూ గతంలో ఉన్న తహసిల్దార్ విద్యార్థులకు కుల, ఆదాయ ఇతర సర్టిఫికెట్స్ ఇవ్వడంలో ఇబ్బంది పెట్టారని ఇప్పుడు అలా జరగకుండా త్వరితగతిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించాలని తహసిల్దార్ ఉమారాణిని కోరారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు మండల పరిధిలో బెల్ట్ షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని అలాంటి షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రతి సమావేశంలో సభా దృష్టి తీసుకు వచ్చినప్పటికీ పరిష్కారం కావడం లదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని శాఖల అధికారులు సమావేశంలో పాల్గొనకపోవడంతో అనేక సమస్యలను సమావేశ దృష్టికి తీసుకురాలేకపోయారు. సమావేశంలో కనీస సౌకర్యాలు మంచినీళ్లు, టీ ఫలహారాలు కూడా ఏర్పాటు చేయకుండా సభ నిర్వహించడం ఏంటని పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలలో సమస్యలు పరిష్కారం అవుతాయని అధికారుల నిర్లక్ష్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని గ్రామాలలో వినూత్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపడుతూ గ్రామాల రూపురేఖలు మార్చాలన్న ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోతుందన్నారు. మండల అభివృద్ధికి అందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్నయ్య, తహసిల్దార్ ఉమారాణి, పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ మహారాజ్, ఇరిగేషన్ ఏఈఈ విజయ ప్రకాష్, కో ఆప్షన్ పర్వేజ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ షబానా, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.